మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :54 | శుక్రవారం , 24 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# 'సం'గ్రామ సభలు

- ఏ గ్రామంలో చూసినా నిరసనలు, నిలదీతలు
- రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజూ ఉద్రిక్త వాతావరణం
- కాంగ్రెస్ గ్యారెంటీల గారడీపై అంతటా గరంగరం
- అనర్హులతోనిండిన జాబితాలను చించివేసిన జనం
- ఖమ్మం జిల్లాలో గ్రామసభ టెంట్ కూల్చిన ప్రజలు
- కూసుమంచి మండలంలో అధికారుల నిర్బంధం
- పలుచోట్ల ఇండ్ల అర్జీలకు రూ.500 చొప్పున వసూలు
- ఇల్లు రాలేదని సెల్‌టవర్ ఎక్కిన పారిశుధ్య కార్మికుడు
- ప్రశ్నిస్తున్న ప్రజలు.. తలపట్టుకుంటున్న అధికారులు
- సమాధానం చెప్పలేక మధ్యలోనే సభల ముగింపు
- ప్రజల ప్రాణాలు తీస్తున్న కాంగ్రెస్ పథకాలు
- మంత్రి శ్రీధర్ బాబు సొంతూర్లోనే అర్హులకు అన్యాయం
- అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు.. గ్రామ పంచాయతీ ఎదుట యువకుడి నిరసన దీక్ష
- మాకు నచ్చినోళ్లకే ఇస్తం.. తాగి ఓట్లేసిన మీకివ్వం.. గ్రామస్తులపై కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం



**హైదరాబాద్,24జనవరి(క్రాంతిన్యూస్:** ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలయ్యాయి. ప్రభుత్వం అందించే ఎంతో కొంత సాయంతో సొంతిల్లు కట్టుకోవాలనుకుంటున్న సామాన్యుడి కలలు కల్లలవుతున్నాయి. గూడు కోసం ఆశలు తీరకముందే ప్రాణాలు పోయే పరిస్థితులు దాపురించాయి. 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయింది' అన్న చందంగా కాంగ్రెస్ పాలన తయారైంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అలవి గానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టింది. తీరా గెలిచాక ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నది. అరకొర పథకాలను ప్రవేశపెట్టినా సవాలక్ష కొర్రీలతో అంతంత మాత్రంగా అమలు చేస్తున్నది.

2లో

## సర్వేలు బొంగు బోషాణం అని లీవులు పెట్టుకుని వస్తే'..

### గ్రామసభలో మహిళ ఆగ్రహం

మహబూబాబాద్ జిల్లా దర్గా తండాలో నిర్వహించిన గ్రామసభలో.. అధికారుల తీరుపై ఓ మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "మేం నగరాల్లో చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తూ పొట్ట పోసుకుంటుంటాం. మరి ఆ కంపెనీల్లో పండుగకు లీవులు, ప్రజాపాలన అప్పుడు లీవులు, సర్వేలు, బొంగు బోషాణం అని ఇక్కడికి తీసుకొస్తారు.. ఒక్క పది నిమిషాలు కూర్చునేందుకు మాకు గాలి కావాలే అంటున్నారు. మరి మీరేం ఆఫీసర్లో నాకర్థం కావట్లేదు. నేను గవర్నమెంట్ సొమ్ము ఏమైనా తిని ఉంటే నన్నడగండి." అంటూ తొడగొట్టి మరి అధికారులను ప్రశ్నించింది ఆ మహిళ. ఆమెకు తోడు.. మేం ఇంకెన్ని సార్లు దరఖాస్తులు ఇవ్వలే సారూ అంటూ మిగతా వాళ్లు కూడా ఆమెకు గొంతు కలిపారు.

2లో

## దావోస్ టూర్...

### కీలక ఒప్పందాలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన విజయవంతంగా పూర్తైంది. దావోస్‌లో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో భాగంగా పలు దిగ్గజ కంపెనీల అధిపతులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా వారిని కోరారు. అలాగే పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ముందుకు వచ్చాయి. తెలంగాణాకు భారీగా పెట్టుబడులు ఆకర్షించడంలో తెలంగాణ రైజింగ్ బృందం సక్సెస్ అయింది. మొత్తం పది కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది.

2లో

### పఠాన్‌చెరు కాంగ్రెస్‌లో

## భగ్గుమన్న వర్గపోరు



ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీస్‌పై కాట శ్రీనివాస్ గౌడ్ వర్గం కార్యకర్తలు దాడి చేశారు. ఆఫీస్‌లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. సేవ్ కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. క్యాంప్‌లో ఉన్న కేసీఆర్ ఫోటోను తొలగించి సీఎం రేవంత్ ఫోటో పెట్టారు. ఇప్పటివరకు అక్కడ సీఎం రేవంత్ ఫోటో ఎందుకు లేదని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తీరుపై స్థానిక కాంగ్రెస్ నేతలు, కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు గుర్రుగా ఉన్నారు. నియోజకవర్గంలో మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రొత్సహిస్తున్నారని.. కాంగ్రెస్ శ్రేణులపై దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

2లో

## ఐటీ ఇండస్ట్రీలో ఉండాలంటే ప్రతిభ ఉండాలి..

### డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి అవసరం లేదు



**హైదరాబాద్,24జనవరి(క్రాంతిన్యూస్) :**ఐటీ పరిశ్రమలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం చాలా అవసరం.. కానీ సంచుల కొద్ది డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకు డబ్బులు పంపించడానికి ఇలాంటివాటితో పనిలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఐటీ ఉద్యోగుల మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక అని చెప్పారు. వారే లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయన్నారు. కేటీఆర్ ఐటీ ఎంప్లాయ్ కాబట్టి ఎంప్లాయ్ మైండ్‌సెట్‌తో ఆలోచిస్తాడు. నేను పొలిటీషియన్‌ని, పాలసీ మేకర్‌ని.. నాకు అన్ని తెలవాల్సిన అవసరం లేదంటూ దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు.

2లో

## ప్రభుత్వ ఉద్యోగులకు 'కొత్త టెన్షన్'

- రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంపు?
- ఆరు పదుల వయస్సులోనూ ఉద్యోగం చేయాల్సిందేనా.?
- రిటైర్డ్ ఉద్యోగుల అంశం తెలంగాణ ప్రభుత్వానికి భారంగా మారిపోయింది
- ఆర్థిక భారం తప్పించుకోవడానికేనా?
- మార్చి నాటికి సుమారు 8వేల మంది ఉద్యోగులు రిటైర్
- ఒక్కొక్కరికి సగటున 30 నుంచి 50 లక్షల రూపాయలు చెల్లించాలి
- 2025 డిసెంబర్ నాటికి సుమారు 10 వేల మంది పదవీ విరమణ
- 2026, 2027 లోనూ దాదాపు 10 వేల మంది
- ప్రతి ఏడాది సుమారు 5వేల కోట్ల రూపాయలు అవసరం
- ఖజానా ఖాళీ.. ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించే పరిస్థితి లేదు
- బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే కారణమని కాంగ్రెస్ ఆరోపణ
- 2021లో ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచిన బీఆర్ఎస్
- 2024 మార్చి 31 వరకు తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్లు జరగలేదు
- రేవంత్ సర్కార్ వచ్చిన 3 నెలల నుంచే పదవీ విరమణలు
- ఆరుపదుల వయస్సు దాటినా.. సేవలు అందించడం కష్టమే
- ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను బాండ్స్ లేదా మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో చెల్సించే ప్రతిపాదన



తెలంగాణలో ఉద్యోగ విరమణ వయస్సును మళ్లీ పెంచనున్నారా.? ఆరు పదుల వయస్సులోనూ ఉద్యోగం చేయాల్సిందేనా.? నిరుద్యోగులకు నిరాశ తప్పదా.? అసలు ఉద్యోగ విరమణ వయస్సును కాంగ్రెస్ సర్కార్ ఎందుకు పెంచాలనుకుంటుంది? ఆర్థిక భారం తప్పించుకోవడానికా.. అనుభవజ్ఞులను వదులుకోవడం ఇష్ట లేదా..?


(శ్రీధర్ యాలాల – సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు)

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త టెన్షన్ పట్టుకుంది. ప్రభుత్వం రిటైర్‌మెంట్ వయస్సును మళ్లీ పెంచే ఆలోచన చేస్తుందనే టాక్ ప్రభుత్వ ఆఫీసుల్లో బిగ్ సౌండ్ చేస్తుంది. పరిస్థితి చూస్తుంటే నిజమే కావొచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగుల అంశం తెలంగాణ ప్రభుత్వానికి భారంగా మారిపోయింది. ఇప్పటికే రేవంత్ సర్కార్.. ఆర్థిక కష్టాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆరు గ్యారెంటీలకు, సంక్షేమ పథకాలకు నిధుల కొరత వేధిస్తోంది. వీటికి తోడు అప్పులకు చెల్లిస్తున్న వడ్డీలు తడిసి మోపెడు అవుతున్నాయట.

2లో

## నేటిమాట

మనిషికి నిజమైన ఆనందం లభించేది కేవలం వారి ఆలోచనల్లోనే



- గౌతమ బుద్ధుడు

## సెక్రటేరియట్ పై ప్రభుత్వం ఆంక్షలు..

### అపు సెక్రటేరియట్ పై ప్రభుత్వం ఆంక్షలు..

### అపుడు గేట్లు బద్దలు కొట్టి.. ఇపుడు ఆంక్షలు...

తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు.. తాజాగా సెక్రటేరియట్ లో ప్రజలు, మీడియా ప్రవేశంపై ఆంక్షలు పెట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది. గేట్లు బద్దలు కొట్టి.. గడీల పాలనకు చరమగీతం పాడం అని చెప్పి.. ఇది ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకున ప్రభుత్వం ఇప్పుడు అడుగడుగున ఆంక్షలు విదిస్తుంది.


2లో



## ఛీ.. ఛీ.. ఇంత దారుణమా?

### మహాకుంభమేళా మెరిసిన మోనాలిసాపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు

మహాకుంభమేళా కార్యక్రమం ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంగా ప్రసిద్ధి చెందింది. ప్రతిసారి కుంభమేళాలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు వస్తారు. అలాగే ఈసారి కూడా ప్రయాగ్ రాజ్ లో నిర్వహిస్తున్న కుంభమేళాలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి బారులు తీరుతున్నారు. ఈ మహాకుంభమేళాలో అఘోరీలు, నాగ సాధులు, ఋషులు ఇంకా దేశ, విదేశాల నుంచి పెద్దెత్తున భక్తులు తరలివస్తున్నారు.



2లో

# 'సం'గ్రామ సభలు

మొదటి పేజీ తరువాయి

రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన ఆ పార్టీ చివరికి రూ.12 వేలతో సరిపెట్టి నమ్మిన రైతులను నట్టేట ముంచింది. ఇదొక్కటనే కాకుండా ఏ ఎక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు నాలుగు ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు చేపట్టిన గ్రామ సభలు రక్తసిక్తమవుతూ యుద్ధక్షేత్రాలను తలపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, అనర్హులకు కేటాయిస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గ్రామ సభల నుంచి తరిమి తరిమికొడుతున్నారు.

టెంట్లు కూల్చేసి, కుర్చీలు విరగొట్టి తమ అసంతృప్తి తెలియజేస్తున్నారు. తమకు నచ్చిన వాళ్లకే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు కేటాయిస్తాం. తాగి పైసలు తీసుకొని ఓటేసిన మీకు ఇవ్వమని గ్రామ సభల్లోనే కాంగ్రెస్ నేతలు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. అనర్హులకు పథకాలను కట్టబెడుతుంటే ఇదేంటని ప్రశ్నించిన ప్రజలపై కాంగ్రెస్ గుండాలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన కొంతమంది అర్హులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు.

ఆయా గ్రామాల్లో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు, పజాప్రతినిధులు తలలు పట్టుకున్నారు. పలుచోట్ల సర్వే సరిగా లేదని, అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ నాయకులే అధికారులకు ఎదురుతిరిగారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు నిరసన సెగ తగిలింది. తమ గ్రామాన్ని ముంపు కింద ప్రకటించాలని నారాయణపూర్ ప్రాజెక్టు ముంపు బాధితులు డిమాండ్ చేశారు. తమ గ్రామాల్లో బస్సులు ఆపడం లేదని నారాయణపేట జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి దమోదర రాజనర్సింహను పలువురు మహిళలు నిలదీశారు.

అన్ని అర్హతలు ఉన్నా గతంలోనూ దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు రాలేదని, కాంగ్రెస్ కార్యకర్తలు, నా యకులనే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని అన్ని చో ట్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు ఇప్పుడు కాంగ్రెస్‌పై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి, ఆవేదన, ఆగ్రహాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులను ఎంపిక చేశారని, రుణమాఫీ, పింఛన్లు అందడం లేదని, మహాలక్ష్మి డబ్బులను ఎప్పుడు పంపిణీ చేస్తారని అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆయా గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించడమే కనిపించింది. జాబితాలను మళ్లీ సర్వే చేసి తయారు చేయాలన్న డిమాండ్ సర్వత్రా వినిపించింది. నిరసనలు, నిలదీతలు, ఆందోళనలతో అధికారులు తలలుపట్టుకున్నారు. ప్రజలకు సమాధానం చెప్పలేక చాలాచోట్ల మధ్యలోనే సభలను నిలిపివేసి వెనుదిరిగారు. మంగళవారం నాటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అన్నిచోట్లా ప్రభుత్వం మరింత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలను చెదరగొట్టే ప్రయత్నం చేసింది. సూర్యాపేట, జనగామ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ నాయకుల అతి ప్రవర్తనతో ప్రజలు విధిలేని పరిస్థితుల్లో అధికారులపై తమ నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

## ప్రజల ప్రాణాలు తీస్తున్న కాంగ్రెస్ పథకాలు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపంతో కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి నాగేశ్వర్ రావు అనే రైతు గ్రామసభ వద్ద పురుగుల మందు తాగాడు. మరోవైపు నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజవర్గం పెద్దకొత్తపల్లిలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు తీసుకొని కూడా మాకు ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ రేగులపాడు నరసింహ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా జిల్లా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

ఇలా రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర గందరగోళం, నిరసనల మధ్య భారీ పోలీసుల బందోబస్తు నడుమ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. గతంలో ఏనాడు కూడా ఇలాంటి నిర్బంధాల మధ్య లబ్ధిదారులను ఎంపిక చేయలేదని ప్రజలు వాపోతున్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి జనం ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఘోరీ కడుతామని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు సొంతూర్లోనే అర్హులకు అన్యాయం

అవినీతి, బంధుప్రీతి, లంచాలు తీసుకుంటూ అనర్హులకు సంక్షేమ పథకాలు కట్టబెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సొంత ఊరిలోనే ప్రజలకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. మంథని నియోజకవర్గం కాటారం మండలం ధన్వాడ గ్రామ సభలో భూమి ఉన్నవారికి, అనర్హులకు పథకాలు వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. భూమి లేని పేద ప్రజలకు, అర్హులకు పథకాలు రావడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులను గుర్తించి ఎంపిక చేయాలని అధికారులను చుట్టుముట్టారు.

## అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు.. గ్రామ పంచాయతీ ఎదుట యువకుడి నిరసన దీక్ష

నల్లగొండ జిల్లాలో ఓ యువకుడు నిరసన దీక్ష( చేపట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు అర్హత ఉన్న పేదలకు కాకుండా అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చాయని ఆరోపించారు. మళ్లీ సర్వే నిర్వహించి పేదలకు న్యాయం చేయాలని గ్రామ పంచాయతీ వద్ద నిరసన దీక్ష చేట్టారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీలో పారదర్శకత పాటించకపోతే ఆందోళన ఉధృతం చేస్తానని హెచ్చరించాడు.

## మాకు నచ్చినోళ్లకే ఇస్తం.. తాగి ఓట్లేసిన మీకివ్వం

యాదాద్రి భువనగిరి జిల్లా మల్లాపురం గ్రామంలో గ్రామసభ ఉద్రిక్తతకు దారి తీసింది. అర్హులైన లబ్ధిదారుల పేర్లను ప్రకటించే క్రమంలో గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మంగ సత్యనారాయణతో పాటు ఇతరులు జోక్యం చేసుకొని ఇష్టారాజ్యంగా మాట్లాడారు.

తాగి పైసలు తీసుకొని ఓట్లేసిన మీకు ఎందుకు ఇవ్వాలని మండిపడ్డారు. మా ఇష్టం ఉన్న వాళ్లకు ఇండ్లు ఇస్తామని, ఏం చేసుకుంటారో చేసుకోండని వాగ్వాదానికి దిగారు. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 నగదు పథకం భూమి ఉన్న వారికి రావడం పై గ్రామస్తులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కర్ర వెంకటయ్య జోక్యం చేసుకొని ప్రజాపాలన అంటే ఇదేనా? అంటూ కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చేయాల్సిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. గ్రామాలలో గ్రామసభలను రైతులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమైనట్టు ఆయన స్పష్టం చేశారు.

# సర్వేలు బొంగు బోషాణం అని లీవులు పెట్టుకుని వస్తే'..

## గ్రామసభలో మహిళ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

నగరాల్లో ఉన్న పెద్ద పెద్ద కంపెనీల్లో చిన్న చిన్న ఉద్యోగాలు చేసే నిరుపేదలకు అటు జీతం తక్కువే ఉంటుంది.. ఇటు సెలవులు కూడా చాలా పొదుపుగానే ఇస్తుంటారు. అలాంటి చిరుద్యోగులు.. ప్రభుత్వ పథకాలు వస్తే ఎంతో కొంత ఆసరాగా ఉంటాయని ఆశపడుతుంటారు. ఈ క్రమంలో.. ఆ పథకాలు పొందటం కోసం ఓసారి దరఖాస్తులు పెట్టుకునేందుకని.. ఇంకోసారి సర్వే చేస్తున్నారంటే.. మరోసారి గ్రామసభలకని లీవులు పెట్టుకుని వస్తే.. తీరా లిస్టుల్లో మీ పేర్లు లేవు.. మళ్లీ దరఖాస్తులు పెట్టుకోవాలి అని చెప్తే.. వస్తదో రాదో కూడా తెలియనివాటి కోసం ఎన్ని లీవులు పెట్టుకోవాలని ఆ చిరుద్యోగులు వ్యక్తం చేసే ఆవేదనలో, ఆవేశంలో, ఆగ్రహంలో కొంత అర్థం ఉందని.. కామెంట్ల రూపంలో నెటిజన్లు అభిప్రాయాలు తెలుపుతున్నారు.

# దావోస్ టూర్... కీలక ఒప్పందాలు

మొదటి పేజీ తరువాయి

దాదాపు రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. కొత్త ఒప్పందాలతో 46 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రికార్డు స్థాయిలో పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే పెట్టుబడులు మూడింతలు మించాయని చెప్పుకోవచ్చు. మరోవైపు ఈరోజుతో సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగియనుంది. ఈరోజు సాయంత్రం దావోస్ పర్యటన ముగించుకొని స్వరాష్ట్రానికి రేవంత్ రెడ్డి బృందం పయనంకానుంది. రేపు (శుక్రవారం) హైదరాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ రైజింగ్ బృందం చేరుకోనుంది.

### పది ప్రముఖ సంస్థలు ఇవే..

1. సన్ పెట్రో కెమికల్స్: భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు. 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు. 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు. రూ. 45,500 కోట్ల పెట్టుబడులు, 7,000 ఉద్యోగాలు

2. అమెజాన్ వెబ్ సర్వీసెస్: ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలోభారీ పెట్టుబడులు. రూ. 60,000 కోట్లు.

3. కంట్రోల్ ఎస్ (%జ్తీశ్రీూ%): తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్. 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్. రూ. 10,000 కోట్లు, 3,600 మందికి ఉపాధి.

4. జేఎస్ డబ్ల్యూ సంస్థ: రాష్ట్రంలో మానవరహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ - రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. రూ.800 కోట్ల పెట్టుబడులు, 200 ఉద్యోగాలు.

5. స్కైరూట్ ఏరో స్పేస్: తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు. రూ.500 కోట్ల పెట్టుబడులు.

6. మేఘా ఇంజనీరింగ్ మూడు కీలక ఒప్పందాలు. రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్నెస్ రిసార్ట్. రూ.15000 కోట్ల పెట్టుబడులు, 5250 మందికి ఉపాధి.

7. హెచ్‌సీఎల్ టెక్ సెంటర్: హైటెక్ సిటీలో3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్. 5000 మందికి ఉపాధి.

8. విప్రో : హైదరాబాద్‌లో విప్రో కంపెనీ విస్తరణ. గోపనపల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్. 5,000 మందికి ఉద్యోగాలు.

9. ఇన్ఫోసిస్: హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్. రూ. 750 కోట్ల పెట్టుబడులు, 17,000 ఉద్యోగాలు.

10. యూనిలివర్ కంపెనీ: కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్. రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు. దాదాపు వెయ్యి ఉద్యోగాలు.

# ప్రభుత్వ ఉద్యోగులకు 'కొత్త టెన్షన్'

(శ్రీధర్ యాలాల - సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు)

మొదటి పేజీ తరువాయి

## సర్కార్‌కు సవాల్

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఇప్పుడు ఉద్యోగుల రిటైర్మెంట్ అంశం కూడా సర్కార్‌కు సవాల్‌గా మారిందని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి సుమారు 8వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ కాబోతున్నారు. అంతే కాదు వచ్చే నాలుగేళ్లలో సుమారు 38 వేల మందిపైగా ఉద్యోగ విరమణ స్టేజ్‌లో ఉన్నారట. అయితే వీరందరికి బెనిఫిట్స్ చెల్లించడం సర్కార్‌కు పెను భారమనే చర్చ జరుగుతోంది..

ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత సర్కార్ చెల్లించాల్సిన బెనిఫిట్స్ చాలానే ఉంటాయి. వారి మూల వేతనం ప్రకారం %ఎ=ూ, జజూ, ణూ%లను కలుపుకొని మొత్తం వేతనానికి 10 రెట్లు లీవ్ శాలరీ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున 30 నుంచి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మార్చి చివరి నాటికి 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ కానున్నారని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. 2025 డిసెంబర్ నాటికి సుమారు 10 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఇదే క్రమంలో 2026, 2027 లోనూ దాదాపు 10 వేల మంది చొప్పున ఉద్యోగులు రిటైర్ కానున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2028లో మరో 8 వేల మంది విరమణ చేస్తారు. వీరందరికి బెనిఫెట్స్ చెల్లించాలంటే ప్రభుత్వానికి అదనంగా ప్రతి ఏడాది సుమారు 5వేల కోట్ల రూపాయలు ఖచ్చితంగా అవసరమవుతాయి. అంటే నెలకు తక్కువలో తక్కువ 400 కోట్లు ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులకే కేటాయించాలన్నమాట.

గత ఏడాది రిటైర్‌మెంట్ అయిన ఉద్యోగులతో పాటు, ఈ ఏడాది రిటైర్ అవుతున్న ఉద్యోగులకు దాదాపు 3వేల 200 కోట్ల రూపాయల వరకు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు అధికారులు. అసలే ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రభుత్వం రిటైర్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించే పరిస్థితుల్లో లేదని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. ఐతే ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల ఏజ్ లిమిట్‌ను గత ప్రభుత్వం పెంచింది. ప్రభుత్వ ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచారు. 2021లో తీసుకున్న ఈ నిర్ణయంతో 2024 మార్చి 31 వరకు తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్లు దాదాపు జరగలేదు.

దీంతో గత ప్రభుత్వం వీరికి ఎలాంటి చెల్లింపులు చేయాల్సిన అవసరం రాలేదు. ఇక రేవంత్ సర్కార్ వచ్చిన 3 నెలల నుంచే పదవీ విరమణలు మొదలవ్వడంతో ఒక్కసారిగా భారం పడుతోంది. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ పే చేయడం సర్కార్‌కు సవాల్‌గా మారిందట.

## 20 వేల కోట్ల రూపాయల భారం?

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం వచ్చే నాలుగేళ్ల కాలంలో 20వేల కోట్ల రూపాయల భారం పడొచ్చని అంచనా వేస్తోంది ఆర్థిక శాఖ. ఈ భారం నుంచి తప్పించుకునేందుకు ఈ ప్రభుత్వం కూడా రిటైర్‌మెంట్ ఏజ్‌ను పెంచే ఆలోచన చేస్తోందని టాక్ వినిపిస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల రిటైర్మెంట్ ఏజ్ 62 ఏళ్లుంటే.. తెలంగాణలో 61 ఏళ్లుగా ఉంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచితే ఎలా ఉంటుందనే ప్రతిపాదినను పరిశీలిస్తోందట.

ఐతే పదవీ విరమణ వయస్సు పెంపుతో ఉద్యోగుల్లోనూ పని చేసే శక్తి ఉండదని టాక్ కూడా వినిపిస్తోంది. ఆరుపదుల వయస్సు దాటినా.. సేవలు అందించడం కష్టమే అంటున్నారు. ఇటు ప్రభుత్వ ఆలోచనను నిరుద్యోగులు, ప్రతిపక్షాలు సైతం తప్పుబడుతున్నాయి. దీంతో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను బాండ్స్ లేదా మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో చెల్సించే అవకాశాలను సైతం తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఉద్యోగ విరమణ వయస్సుపై సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది అటు ఉద్యోగుల్లో, ఇటు నిరుద్యోగుల్లో ఉత్కంఠగా మారింది.

# పఠాన్‌చెరు కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం నేతలు, కార్యకర్తలకు నిరసన చేపట్టారు.ఎమ్మెల్యే అనుచరులు దాడి చేస్తున్నారని ఆరోపించారు. పాత, కొత్త నేతల మధ్య పంచాయితీ తేల్చాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు చౌరస్తా దగ్గర బైఠాయించి ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తతలు తలెత్తకుండా అక్కడ పోలీసులు భారీగా మోహరించారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన గూడెం మహిపాల్ రెడ్డి 2024 జూలైలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఆయన పార్టీలో చేరడం పటాన్ చెరు స్థానిక కాంగ్రెస్ నేతలకు ఇష్టం లేదు. అయితే స్థానిక నేతలకు నచ్చజెప్పి గూడెంను పార్టీలో చేర్చుకుంది కాంగ్రెస్ నాయకత్వం. అయితే ఆయన పార్టీలో చేరిన నుంచి తరుచూ ఎమ్మెల్యే అనుచరులు తమపై దాడికి దిగుతున్నారని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా బీఆర్ఎస్ శ్రేణులను ప్రోత్సహిస్తున్నారన్నది పటాన్‌చెరు కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్ అనుచరుల వాదన. తమను ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఇబ్బందిపెడుతున్నారని వాళ్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారు. పలుసార్లు గాంధీభవన్ వేదికగా కూడా మహిపాల్ రెడ్డి, కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరుల మధ్య గొడవలు జరిగాయి. ఇప్పటికే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై పటాన్ చెరు కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశాయి. ఈ క్రమంలో ఇవాళ మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా కాట శ్రీనివాస్‌గౌడ్ వర్గీయులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో.. దీనిపై పార్టీ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందన్నది ఆసక్తిగా మారింది.

# ఐటీ ఇండస్ట్రీలో ఉండాలంటే ప్రతిభ ఉండాలి..

## డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి అవసరం లేదు

మొదటిపేజీ తరువాయి

'తనను ఓ ఐటీ ఉద్యోగి అంటూ తక్కువ చేసి మాట్లాడొచ్చని అనుకునేవాళ్లకు ఒకటే చెప్పదలచుకున్నా. ఐటీ పరిశ్రమలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం చాలా అవసరం. కానీ సంచుల కొద్దీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకు డబ్బులు పంపించడానికి ఇవేమీ అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడి వారి జీవనోపాధిని పొందుతున్నారు.

ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల్లో ఉన్న నా అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు సలాం. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక. మీరు లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ విద్యార్హతలకు, మీ నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్లు ప్రవేశపెట్టే అనాలోచిత విధానాలకు మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం. నా విద్యార్హతలు, నా ఉద్యోగ అనుభవం, ఐటీలో నా నేపథ్యం.. ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# సెక్రటేరియట్ పై ప్రభుత్వం ఆంక్షలు..

మొదటి పేజీ తరువాయి

సచివాలయానికి వస్తున్న సందర్శకులపై భద్రతా సిబ్బంది రోజుకో కొత్తరకం ఆం క్షలు విధిస్తున్నారు. మధ్యాహ్నం 3-5 గంటల మధ్య సందర్శన వేళల్లో లోపలికి వెళ్లాలంటే చెకింగ్‌ల పేరుతో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని సందర్శకులు వాపోతున్నారు. సచివాలయంలోనికి వెళ్లేందుకు మీడియాపాయింట్‌లోని కౌంటర్‌లో పాస్‌లు జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఎవరైనా బృందంగా వెళ్లాలనుకుంటే వారిలో ఒక్కరి వివరాలు సమర్పించి, మిగతా వారి అంకె వేసి పాస్ ఇచ్చేవారు. కానీ బుధవారం నుంచి ఒక్క పాస్ ఒక్కరికి మాత్రమే జారీ చేస్తున్నారు.

అంటే.. సచివాలయంలోకి వెళ్లాలనుకునే ప్రతి ఒక్కరూ పాస్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు చూసి, వివరాలన్నీ నమోదు చేసుకొని, ఫొటో తీసుకున్న తర్వాతే పాస్ మంజూరు చేస్తున్నారు. అయినా.. సచివాలయంలోకి వెళ్లే ప్రధాన గేటు దగ్గర మరోసారి ఆధార్ కార్డు చూపించాలని సిబ్బంది పట్టుబడుతున్నారు. దీంతో ఎన్నిసార్లు ఆధార్ చూపించాలంటూ సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైగా.. సచివాలయ ప్రధాన గేటుకు పది అడుగుల ముందు కొత్తగా ఒక బారీకేడ్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా అక్కడ పాస్, ఆధార్ కార్డు పరిశీలించి పంపిస్తున్నారు.

పది అడుగులు వేయగానే ప్రధాన గేటు వద్ద మరోసారి పాస్‌ను పరిశీలిస్తున్నారు. లోపల సచివాలయ భవనంలోకి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద మరోసారి స్కానర్లతో చెక్ చేస్తున్నారు. ఇలా ఐదు దశలను దాటితే తప్ప సచివాలయ భవనంలోకి వెళ్లలేకపోతున్నామని సందర్శకులు వాపోతున్నారు. గతంలో ఇన్ని ఆంక్షలు లేవన్నారు. కొందరు మంత్రులు, అధికారుల పేషీల నుంచి ప్రత్యేక అనుమతితో లోనికి వెళ్తుంటారు. గతంలో వారిని నేరుగా లోపలికి పంపేవారు. కానీ ఇప్పుడు వారిని కూడా ఆధార్ చూపించిన తర్వాతే లోనికి పంపుతున్నారు. సచివాలయంలోకి కార్లల్లో వెళ్లేవారికి మాత్రం ఆంక్షలు లేకపోవడంపై సందర్శకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## లోపలా.. ఆంక్షలే

సందర్శకులకు సచివాలయంలోనూ ఆంక్ష లు కొనసాగుతున్నాయి. సీఎం పేషీతోపాటు, సీఎంవో అధికారుల కార్యాలయాలు ఉండే ఆరో అంతస్థును ఒక నిషిద్ధ ప్రదేశంగా మార్చేశారు. ప్రత్యేక అనుమతి ఉన్నవారిని మాత్రమే ఆరో అంతస్తులోకి అనుమతిస్తున్నారు. వీఐపీ లు వెళ్లే లిఫ్టులు తప్ప మిగతా అన్నింటినీ ఐదో అంతస్తు వరకు మాత్రమే పరిమితం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇన్ని ఆంక్షలు లేవని సందర్శకులు చెప్తున్నారు.డు గేట్లు బద్దలు కొట్టి.. ఇపుడు ఆంక్షలు...


## ఛీ.. ఛీ.. ఇంత దారుణమా?

# మహాకుంభమేళా మెరిసిన మోనాలిసాపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఇవన్నీ ఒకవైపు ఉండగా ఈ కుంభమేళాలో పూసలు అమ్ముతున్న ఓ యువతి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ హల్చల్ చేసింది. ఆమె 'మోనాలిసా'. ఇండోర్‌కు చెందిన ఈ యువతి ప్రస్తుతం జరుగుతున్న కుంభమేళాలో తన సహజ అందంతో అందరిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం మోనాలిసా సోషల్ మీడియాలో ఓ సెన్సేషన్‌గా మారింది. ప్రస్తుత కుంభమేళలో ఆవిడకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తెగ వైరల్‌గా మారాయి.ఇకపోతే తాజగా తీన్మార్ మల్లన్న తన చానెల్ లో ఈ అమ్మాయి వీడియో చూపిస్తూ ఆ అమ్మాయి కులం ప్రస్తావన తేవడం అందరికీ ఆగ్రహానికి గురి చేస్తుంది. ఆ అమ్మాయి గురించి పలు రకాలుగా వ్యంగ్యంగా మాట్లాడడం, ఆ అమ్మాయిని చూస్తుంటే విరహ వేదన అని చెప్పడం తీన్మార్ మల్లన్నకు అమ్మాయిల మీద ఉన్న చిన్న చూపును తెలియజేస్తుంది. ఆ అమ్మాయితో సినిమా తీస్తే అందులో డ్యూయట్ లు ఉండాలి, రొమాన్స్ లు ఉండాలి అని చెప్పడం ఎంతవరకు కరెక్ట్ అని నెటిజెన్స్ ఫైర్ అవుతున్నారు. ఆ అమ్మాయి ఎస్టీ లంబాడీ అమ్మాయి అని చిన్న చూపుతో చెప్పడం నిజంగా సిగ్గు చేటు. ఇప్పటికైన మల్లన్న ఇలాంటి వ్యాఖ్యలను ఆపాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. తీన్మార్ మల్లన్నలాంటి వ్యక్తి సమాజంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి, కానీ ఇలాంటి వ్యాఖ్యలతో మహిళలను కించపరచడం సరైన ఆచరణగా లేదు. సోషల్ మీడియాలో నెటిజన్లు మల్లన్నపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని, అలాగే మహిళలను గౌరవించే విధంగా ప్రవర్తించాలని సూచిస్తున్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రెడ్ అలర్ట్




న్యూస్ డెస్క్ : హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు భద్రతా బలగాలు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. జనవరి 30వ తేదీ వరకు.. ఈ రెడ్ అలర్ట్ కొనసాగుతుందని ప్రకటించాయి. అయితే.. జనవరి 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. ఈ క్రమంలోనే.. శంషాబాద్ ఎయిర్ పోర్టు నిఘా విభాగం అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో.. జనవరి 30వ తేదీ వరకు ఎయిర్ పోర్టుకు సందర్శకులెవ్వరూ రావొద్దని కీలక ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విమానాశ్రయంలో భద్రతను సీఐఎస్ఎఫ్ కట్టుదిట్టం చేసింది.

ఈ నేపథ్యంలో.. విమానాశ్రయంలోని ప్రధాన రహదారిలో ఎక్కడికక్కడ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతున్నారు. ఎయిర్ పోర్టుకు వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అంతేకాకుండా.. ప్రయాణికులు కాకుండా ఎయిర్ పోర్టుకు వచ్చే సందర్శకులకు అనుమతి నిరాకరిస్తూ అధికారులు ప్రకటన జారీ చేశారు. ఇప్పటికే.. రిపబ్లిక్ డే వేడుకల కోసం హైదరాబాద్ నగరాన్ని ముస్తాబు చేస్తున్నారు. మరోవైపు.. పరేడ్ గ్రౌండ్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చివరి దశకు చేరుకుంటున్నాయి. పోలీసులు రిహార్సల్స్ కూడా నిర్వహిస్తున్నారు.

అయితే.. రిపబ్లిక్, ఇండిపెండెన్స్ డే నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు ఇలా విమానాశ్రయాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించి.. అప్రమత్తంగా ఉంటుంటారు. అందులోనూ.. హైదరాబాద్ లాంటి ఉగ్రకదలికలు ఉండే నగరాల్లో ఇంకాస్త ఎక్కువ నిఘా పెట్టాల్సిన అవసరం ఉంటుంది. అది కూడా ఇలాంటి ప్రత్యేక రోజుల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే.

మరోవైపు.. తెలంగాణ సచివాలయం వద్ద కూడా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇప్పటివరకు సచివాలయం లోపలికి సాధారణ ప్రజలను విరివిగా అనుమతించేవారు. కాగా.. ఇకపై సచివాలయం లోపలకు వెళ్లే వారికి ఇచ్చే పాసుతో.. ఒక్కరిని మాత్రమే అనుమతించనున్నారు. పాసు లేకుండా లోపలికి అనుమతించకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు.

# తెలంగాణవాసులకు అలర్ట్..

## లిస్టుల్లో పేర్లు లేనివారికి బిగ్ రిలీఫ్..

### మంత్రి ఉత్తమ్ రెడ్డి కీలక ప్రకటన

తెలంగాణ వ్యాప్తంగా హడావుడి నెలకొంది. జనవరి 26న నాలుగు సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో.. గ్రామ, వార్డు సభలతో రాష్ట్రవ్యాప్తంగా సందడి వాతావరణం ఏర్పడింది. అయితే.. రైతు భరోసా, ఇందిరా ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను అధికారులు చదివితెలంగాణ వ్యాప్తంగా హడావుడి నెలకొంది. జనవరి 26న నాలుగు సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో.. గ్రామ, వార్డు సభలతో రాష్ట్రవ్యాప్తంగా సందడి వాతావరణం ఏర్పడింది. అయితే.. రైతు భరోసా, ఇందిరా ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను అధికారులు చదివి వినిపిస్తున్నారు. అయితే.. ప్రజాపాలన సమయంలో, కుల గణన సమయంలో ఇచ్చిన వివరాల ప్రకరమే జాబితాలు తయారు చేస్తామని చెప్పిన సర్కార్.. జాబితాల్లో మాత్రం అర్హులందరి పేర్లు ప్రకటించకపోవటంతో పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు. అయితే.. అర్హులైన వారి పేర్లు జాబితాల్లో రాకపోతే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మళ్లీ దరఖాస్తులు ఇస్తే పరిశీలిస్తామని అధికారులు చెప్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చివరి లబ్ధిదారుడికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే.. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరోసారి భరోసా ఇచ్చారు. ఐదేళ్ల పాటు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని.. పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే.. ప్రచారంలో ఉన్న జాబితా ఫైనల్ లిస్ట్ కాదని.. అవి కేవలం వెరిఫికేషన్ కోసం మాత్రమేనని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఇదే క్రమంలో.. బీఆర్ఎస్ అధ్యయన కమిటీపై ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో కేవలం 40 వేల రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చినట్టుగా మంత్రి గుర్తుచేశారు. కానీ.. తాము మాత్రం లక్షల్లో ఇవ్వబోతున్నట్లు వివరించారు.



# మీర్‌పేట మహిళ హత్య కేసులో దిమ్మతిరిగే ట్విస్ట్



హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టిస్తోన్న మీర్‌పేట మహిళ హత్య కేసులో కొత్త కొత్త ట్విస్టులు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటివరకు గురుమూర్తి.. తన భార్య మాధవిపై అనుమానం పెంచుకుని.. ఆ విషయంలో జరిగిన గొడవలో ఆమెను మట్టుబెట్టాడన్న విషయమే తెలుసు. కానీ.. ఇప్పుడు మరో దిమ్మతిరిగే విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు గురుమూర్తి మొబైల్‌లో మరో మహిళకు సంబంధించిన ఫోటోలను పోలీసులు గుర్తించారు. దీంతో.. ఈ కేసు దర్యాప్తు మరో మలుపు తిరిగింది. దీంతో.. ఆ ఫొటోల్లో ఉన్న మహిళతో ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగానే.. మాధవిని వదిలించుకునేందుకు గురుమూర్తి హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

పోలీసుల ప్రాథమిక అంచనావ ప్రకారం అసలు జరిగిందేంటంటే.. గురుమూర్తి అనే వ్యక్తి ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం జిల్లెలగూడలో నివాసముంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురుమూర్తికి.. 13 ఏళ్ల క్రితం మాధవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కాగా.. గత కొన్ని రోజులుగా దంపతులిద్దరి మధ్య.. గొడవలు జరుగుతున్నాయి. ఆ గొడవలకు కారణం.. గురుమూర్తి ఫోన్‌లో ఉన్న మహిళ ఫోటోలను చూసిన మాధవి.. అతన్ని ప్రశ్నించింది. ఇదే విషయంపై గత కొంతకాలంగా గొడవలు జరుగుతుండగా.. ఈనెల 15న కూడా భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది.

అయితే.. సంక్రాంతి సెలవులు కావటంతో పిల్లలిద్దరినీ అమ్మమ్మ ఇంటికి పంపించటంతో.. ఇంట్లో ఇద్దరే ఉండటం వల్ల గొడవ కాస్త పెద్దగానే జరిగింది. ఈ క్రమంలో కోపాద్రిక్తుడైన గురుమూర్తి మాధవిపై దాడి చేసినట్లు పోలీసులు అంచనావేస్తున్నారు. ఈ దాడిలో భార్యను గోడకేసి బాదడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఎలాగూ వాళ్లిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులకు తెలియటంతో.. తనతో గొడవ పెట్టుకుని ఎటో వెళ్లిపోయిందని చెప్పొచ్చని.. మొదట మాధవి మృతదేహాన్ని మాయం చేయాలని భావించాడు గురుమూర్తి.

పోలీసుల కస్టడీలో గురుమూర్తి చెప్పినట్టుగా.. భార్యను మటన్ కొట్టే కత్తులతో ముక్కలు ముక్కలుగా చేసి బకెట్‌లో హీటర్‌తో, కుక్కర్‌లో ఉడికించి ఎండబెట్టి.. పొడిగా చేసి చెరువులో పడేసి.. ఇంట్లో ఎలాంటి ఆనవాళ్లు లేకుండా రక్తపు మరకలు పోయేలా ఫినాయిల్‌తో శుభ్రంగా కడిగేసి జాగ్రత్తపడినట్టు అంచనావేస్తున్నారు. మరి గురుమూర్తి చెప్పిన ఈ ముక్కల స్టోరీ నిజమేనా కాదా అన్నది కూడా.. సీసీ కెమెరాలు మిగతా సాంకేతికతను ఉపయోగించుకుని నిర్ధారించుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

## జగిత్యాలలో పెద్దపులి కలకలం




జగిత్యాల జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. జిల్లాలోని కొడిమ్యాల మండలం కొండాపూర్ శివారులో పెద్దపులి సంచరించింది. బుధవారం కొండాపూర్ శివారులోని పొలాల దగ్గర ఓ అవును గొంతు కొరికి చంపేసింది పెద్దపులి. సీసీ కెమెరాలలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా పెద్దపులిగా నిర్దారించారు ఫారెస్ట్ అధికారులు. ఈ ఘటనతో రాత్రిపూట బయటకు వెళ్లకూడదని గ్రామ ప్రజలకు ఆదేశించిన ఫారెస్ట్ అధికారులు.

పొలం దగ్గర ఉన్న అవును గొంతు కొరికి చంపేసిన పులి.. ఆవు వెనుక భాగం పూర్తిగా మాంసం తిని వెళ్లిపోయినట్లు తెలిపారు అధికారులు. పెద్దపులి ఎప్పుడు ఎటువైపు నుంచి వస్తుందో అని భయాందోళనతో గడుపుతున్నామని అంటున్నారు గ్రామస్థులు. ఈ ఘటనతో అప్రమత్తమైన అటవీ అధికారులు కొండాపూర్ ప్రాంతంలో అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

# తెలంగాణ రైతులకు శుభవార్త..

తెలంగాణ రైతుల అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రేవంత్ రెడ్డి సర్కార్.. ఇప్పటికే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు అమలు చేస్తోంది. మొన్నటివరకు రూ.2 లక్ష మేర ఉన్న రుణాన్ని మాఫీ చేసి.. రైతుల ముఖాల్లో సంతోషాన్ని తీసుకొచ్చింది. కాగా.. జనవరి 26న రైతు భరోసాతో పాటు, ఇందిర ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించనుంది. ఇందుకోసం.. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి.. గ్రామసభల్లో అర్హుల జాబితాలను ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. రైతులకు మరో శుభవార్త వినిపించింది రేవంత్ రెడ్డి సర్కార్. గతంలో ఆగిపోయిన ఓ పథకాన్ని మళ్లీ ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం నిధులు కూడా విడుదల చేసింది.



వ్యవసాయ యాంత్రీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టిన రేవంత్ రెడ్డి సర్కార్.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిపోయిన సబ్సిడీ వ్యవసాయ యంత్రాల పంపిణీ పథకాన్ని మళ్లీ ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. ఈ ప్రకటన ఇప్పుడు తెలంగాణ రైతుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. పంట దిగుబడి పెంచేలా అన్నదాతలకు అధునాతమైన యంత్ర పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. యాసంగి పంట కాలం నుంచే రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేయాలని భావిస్తోంది.

కొన్నేళ్లుగా ఈ పథకం నిలిచిపోవడంతో రైతులు పంట దిగుబడిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించినట్టు సమాచారం. కాంగ్రెస్ హయాంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదని నిర్ణయించగా.. ఈ పథకాన్ని మళ్లీ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. ఈ పథకం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ. 26 కోట్లు కేటాయించింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.20 కోట్లు మంజూరు చేసింది. అంతేకాకుండా నేరుగా వ్యవసాయ శాఖ నుంచే పరికరాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే.. ఈ పంపిణీ కింద గతంలో ట్రాక్టర్ల పంపిణీకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. అవి చిన్న, సన్నకారు రైతులకు కాకుండా పెద్ద రైతులకు మాత్రమే వచ్చేవి. దీంతో.. రేవంత్ రెడ్డి సర్కార్ ఈసారి ట్రాక్టర్లను పంపిణీ చేయవద్దని నిర్ణయించారు. హార్వెస్టర్లు, పవర్ టిల్లర్లు, ఎంబీ నాగళ్లు, తైవాన్ స్ప్రేయర్లు, గడ్డికట్టలు కట్టే బేలార్ యంత్రాలు, రొటోవేటర్లు, పత్తి తీత, మామిడికాయలను తెంపే, పసుపు ఉడికించే, మొక్కజొన్నలను ఒలిచే యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. రైతులకు అవసరమైన యంత్రాల జాబితాను ఇప్పటికే రూపొందించామని, రైతులు కొనుగోలు చేసిన పరికరాలను తమ సొంత అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

## తెలంగాణలో కొత్తగా నేషనల్ హైవే.. బీజేపీ ఎంపీ కీలక హామీ, తగ్గనున్న దూరం

తెలంగాణలో రహదారుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫోకస్ పెట్టాయి. ఇప్పటికే అనేక మార్గాల్లో కొత్త రహదారులు మంజూరు చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పలు జాతీయ రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిని 4 నుంచి 6 వరుసలుగా విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మరికొన్ని ప్రాంతాల మధ్య కొత్తగా రహదారులు నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రహదారులు నిర్మిస్తుండగా.. మరికొన్ని రోడ్లను కేంద్రం నిర్మిస్తోంది.


తాజాగా తెలంగాణలో మరో నేషనల్ హైవే నిర్మాణంపై కీలక హామీ వచ్చింది. చేగుంట నుంచి దుబ్బాక మీదుగా రాజన్నసిరిసిల్ల వరకు నేషనల్ హైవే నిర్మించాలని ఎప్పట్నుంచో డిమాండ్ ఉంది. ఈ విషయంపై స్థానికులు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు కూడా సమర్పించారు. తాజాగా.. ఆ నేషనల్ హైవేపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక హామీ ఇచ్చారు. జాతీయ రహదారి నిర్మాణం విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. స్థానిక ప్రజల ఆంకాంక్షల మేరకు రోడ్డు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు.

దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు ఈ విషయంపై ఎంపీకి వినతిపత్రం అందించారు. చేగుంట%-%సిరిసిల్ల మధ్య నేషనల్ హైవే చేపడితే రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడకు ఈజీగా చేరుకోవచ్చునని అన్నారు. వేములవాడ- హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుందని చెప్పారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్ రావు ఈ రహదారి అంశాన్ని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నేషనల్ హైవే మంజూరుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రహదారి నిర్మాణంపై చర్చిస్తానని ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు.

కాగా, ఎంపీ ప్రకటనతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణం కోసం పోరాడుతున్నామని చెప్పారు. త్వరితగతిన రహదారి మంజూరైతే.. ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని అంటున్నారు.



## రేషన్ కార్డుల జాబితాలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పేరు..






తెలంగాణ వ్యాప్తంగా సంక్షేమ పథకాలకు సంబంధించిన హడావుడి నడుస్తోంది. జనవరి 26 నుంచి రాష్ట్రంలో రైతు భరోసా, ఇందిర ఆత్మీయ భరోసా పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే.. అన్ని ఊళ్లల్లో గ్రామ సభలు నిర్వహిస్తూ.. అర్హులైన లబ్ధిదారుల పేర్లను అధికారులు చదివి వినిపిస్తున్నారు. ఈ క్రమంలోనే.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో నిర్వహించిన గ్రామసభలో ఆసక్తికర సంఘటన ఎదురైంది. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను ఒక్కొక్కటిగా కార్యదర్శి ధర్మేందర్ చదివి వినిపిస్తున్నారు. రేషన్ కార్డుల జాబితాను చదవి వినిపిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు వచ్చింది. ఆ పేరు చదవగానే గ్రామ సభలో ఉన్న ప్రజలంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పేరు రేషన్ కార్డుల జాబితాలో రావటమేంటని షాక్‌తో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఇదే విషయం కార్యదర్శికి కూడా అనుమానం వచ్చి చెక్ చేయగా.. దరఖాస్తు ఐడీ నంబర్ 18608965తో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు కనిపించింది. ఈ పెద్ది సుదర్శన్ రెడ్డి వేరేమో అనుకుని.. అడ్రస్ చెక్ చేయగా దరఖాస్తులో పెద్ది సుదర్శన్ రెడ్డి చిరునామాతో కూడిన ఇంటి నంబర్ 6-86, లెంకాలపల్లి రోడ్డు, నల్లబెల్లి అని స్పష్టంగా ఉండటం గమనించారు. ఆ వివరాల్లో ఫోన్ నంబరు కూడా పెద్ది సుదర్శన్ రెడ్డిదే ఉండటం గమనార్హం.

దీంతో.. ఈ దరఖాస్తు పెద్ది సుదర్శన్ రెడ్డిదిగానే అధికారులు భావించగా.. ఆన్‌లైన్‌లో సమర్పించినట్టు అంచనా వేస్తున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కావడంతో.. ఆ దరఖాస్తు తిరస్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే.. పెద్ది సుదర్శన్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా, నర్సంపేట ఎమ్మెల్యేగా పదవులు అనుభవించారు. అలాంటి నేత పేరుతో రేషన్ కార్డు దరఖాస్తు ఉండటం ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా ఆయనకే ఛాన్స్?..
## అప్పుడు పోస్టింగ్ మిస్, ఈసారి పక్కా!




ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీ ఎవరనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ కొత్త పోలీస్ బాస్ ఎవరనేది ఆసక్తికరంగా మారింది. అయితే డీజీపీ రేస్‌లో హరీష్‌కుమార్ గుప్తా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన్నే నూతన డీజీపీగా నియమించే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. 1992 బ్యాచ్‌కు చెందిన హరీష్‌కుమార్ గుప్తా ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా కీలక బాధ్యతల్లో ఉన్నారు.

ఈ నెలాఖరుకు ప్రస్తుత డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పదవీవిరమణ చేయనుండటంతో.. హరీష్‌కుమార్ గుప్తాను డీజీపీగా నియమించనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే తిరుమలరావు ప్రస్తుతం డీజీపీతో పాటుగా ఆర్టీసీ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతల్లో ఉన్నారు. ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత ఆర్టీసీ ఎండీ పోస్టులో కొనసాగించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి హరీష్‌కుమార్ గుప్తా డీజీపీగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో.. అప్పటి డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డిని ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయన స్థానంలో హరీష్ కుమార్ గుప్తాను ఎన్నికల సంఘం డీజీపీగా నియమించింది. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో ఆయన ఆ పోస్టులో కొనసాగారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వ ప్రభుత్వం హరీష్‌కుమార్ గుప్తా స్థానంలో.. సీహెచ్ ద్వారకా తిరుమలరావును డీజీపీగా నియమించింది. తిరుమలరావు నెలాఖరుకు పదవీవిరమణ చేస్తే.. ఆ తర్వాత డీజీపీ కోసం సీనియారిటీ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ మొదటి స్థానంలో.. హరీష్‌కుమార్ గుప్తా రెండో స్థానంలో ఉన్నారు. అయితే ప్రభుత్వం హరీష్ గుప్తాకే అవకాశం ఇస్తుందనే చర్చ జరుగుతోంది. త్వరలోనే ఈ అంశంపై క్లారిటీ రానుంది. మూడు రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్‌ల బదిలీలు కూడా జరిగాయి.. కొంతకాలంగా వెయిటింగ్‌లో ఉన్నవారికి పోస్టింగ్‌లు దక్కాయి. ఇటు డీజీపీ ద్వారకా తిరుమలరావు కూడా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారు.

# చంద్రబాబు తర్వాతి స్థానం లోకేష్‌దే..

- అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు డిప్యూటీ సీఎం అనే అంశం తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పలువురు.. డిప్యూటీ సీఎం పదవిని మంత్రి నారా లోకేష్‌కు కట్టబెట్టాలని డిమాండ్లు వ్యక్తం చేస్తున్నారు. అటు ఈ వార్తలపై జనసేన నేతలు గట్టిగానే కౌంటర్లు ఇస్తున్నారు. నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం ఇస్తే.. సీఎం పదవి పవన్ కళ్యాణ్‌కు అప్పగించాలని జనసైనికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే రోజురోజుకూ ఇలాంటి డిమాండ్లు పెరుగుతుండటంతో వాటికి అడ్డుకట్ట వేసేందుకు అటు తెలుగుదేశం పార్టీ.. ఇటు జనసేన పార్టీ హైకమాండ్‌లు స్పందించాయి. ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని రెండు పార్టీల నేతలు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు చేశాయి. అయినా కొందరు నేతలు ఇవే వ్యాఖ్యలు చేస్తుండటం గమనార్హం.ఏపీ రాజకీయాల్లో డిప్యూటీ సీఎం పదవిపై జోరుగా వార్తలు, ఊహాగానాలు, చర్చలు జరుగుతున్న వేళ.. తాజాగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎవరు ఏం అనుకున్నా తెలుగుదేశం పార్టీలో నారా చంద్రబాబు నాయుడు తర్వాతి స్థానం నారా లోకేష్‌దే అని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి వివాదం లేదని అచ్చెన్నాయుడు తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమికి 164 సీట్లు సాధించడంలో నారా లోకేష్ పాత్ర ఎంతో ఉందని ఆయన గుర్తు చేశారు.అయితే నారా లోకేష్‌కు ఏపీ డిప్యూటీ సీఎం పదవిపై వస్తున్న వార్తలపైనా అచ్చెన్నాయుడు స్పందించారు. అయితే నారా లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలనే అంశం ఒక్కరు తీసుకునే నిర్ణయం కాదని వెల్లడించారు. పదవులు అయినా.. నిర్ణయాలు అయినా కూటమి ప్రభుత్వం కలిసి తీసుకుంటుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అందులో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలకు తావు లేదని తేల్చి చెప్పారు. విశాఖలో వుడా ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 500 మందితో మెగా రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 100 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. ప్రజలకు సేవ చేయాలనే కోరికతో నారా లోకేష్ రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా లోకేష్ చరిత్ర సృష్టించారని.. రాష్ట్రంలో 27 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేశారని గుర్తు చేశారు. ప్రతీ కరెంట్ స్తంభానికి లైట్లతో వెలుగులు తెచ్చారని.. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా తాగునీరు అందించినట్లు వెల్లడించారు.

# ఏపీలో మరో పథకం అమలుపై కీలక అప్డేట్

### తల్లికి వందనం అమలుపై మంత్రి ప్రకటన

### ముహూర్తం ఎప్పుడో చెప్పిన మంత్రి స్వామి



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఇప్పటికే పలు హామీలను నిలబెట్టుకోగా.. తాజాగా సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీల అమలుకు కసరత్తు చేస్తోంది. తాజాగా మరో పథకం అమలుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.. ఈ మేరకు మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సరే.. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మంత్రి నెల్లూరు జిల్లా కందుకూరులో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు.. అక్కడ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం నాశనమైందన్నారు.

సూపర్ సిక్స్ పథకాల్లో కీలకమైన తల్లికి వందనం పథకంపై మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పథకాన్ని ఈ ఏడాది మే నెల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.. ఈ మేరకు కసరత్తు జరుగుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో మాత్రమే రూ.4వేలు పింఛన్ అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆరు నెలలైందని.. తమ చేతిలో మంత్రదండం ఏమీ లేదని.రు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా సరే తిరిగి పునర్ నిర్మాణాన్ని చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం ఒక్కొక్కటి నిలబెట్టుకుంటున్నామన్నారు. పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించేవారికి సిగ్గుండాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి తల్లికి వందనం కార్యక్రమంపై హామీ ఇచ్చింది.. అర్హత ఉండి బడికి వెళ్లే విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రతి ఏటా రూ.15వేలు ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుకు సిద్ధమవుతున్నట్లు మంత్రి స్వామి కీలకమైన ప్రకటన చేశారు.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి సూపర్-6 పథకాలను ప్రకటించింది. ఇప్పటికే మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తోంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500 వంటి పథకాలపై కసరత్తు చేస్తోంది. త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేసి పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు ఇటీవల బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే తల్లికి వందనం పథకంపై మాత్రం మంత్రి క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పేరుతో ప్రతి ఏటా ఒక్కో విద్యార్థికి రూ.10వేలు అందించేవారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం పేరుతో రూ.15వేలకు పెంచింది. ఇప్పుడు ఈ పథకం అమలు కోసం కసరత్తు చేస్తోంది.. త్వరలోనే మార్గ దర్శకాలను విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.

# దావోస్‌లో కాగ్నిజెంట్ సీఈఓతో లోకేష్ భేటీ..



రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ సహ అధికారుల బృందం దావోస్‌లో పర్యటిస్తోంది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామిక వేత్తలకు.. ఏపీలో ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, అనువైన ప్రదేశాలను వివరించి.. వారితో పెట్టుబడులు పెట్టించేందుకు.. ఏపీ సర్కార్ తీవ్ర కసరత్తులు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో వివిధ కంపెనీలు, బిజినెస్‌మెన్‌లతో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి నారా లోకేష్ దావోస్ నుంచి ఒక కీలక ప్రకటన చేశారు.

దావోస్ పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్‌తో భేటీ అయినట్లు ట్విటర్ వేదికగా నారా లోకేష్ వెల్లడించారు. ఈ క్రమంలోనే కాగ్నిజెంట్ కంపెనీ నుంచి త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు గుడ్‌న్యూస్ రాబోతోందని తెలిపారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలో 2.2 మిలియన్ చదరపు అడుగుల కోవర్కింగ్ స్పేస్ అందుబాటులో ఉందని ఈ సందర్భంగా నారా లోకేష్ స్పష్టం చేశారు. కాగ్నిజెంట్ గ్రోత్ స్ట్రాటజీ, రీజినల్ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం వంటి టైర్-2 నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని కోరినట్లు లోకేష్ వెల్లడించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సహా వివిధ విభాగాల్లో హైస్కిల్డ్ వర్క్ ఫోర్స్‌ను తయారు చేయడానికి తమ ప్రభుత్వంతో భాగస్వామ్యం చేసుకోవాలని కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్‌కు లోకేష్ విజ్ఞప్తి చేశారు. కాగ్నిజెంట్ టెక్నాలజీస్‌లో పనిచేస్తున్న 80 వేలమంది ఉద్యోగులను.. టైర్ -1 నగరాల నుంచి టైర్ -2 నగరాలకు మార్చేందుకు ఇప్పటికే ప్రణాళికలు ప్రకటించినట్లు ఈ సందర్భంగా కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ స్పష్టం చేశారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచేసిన ప్రతిపాదనలపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని కాగ్నిజెంట్ సీఈఓ వెల్లడించారు.

# కాలేజీ మూడో ఫ్లోర్ నుంచి దూకిన ఇంటర్ విద్యార్థి..

### సీసీ కెమెరాలో దృశ్యాలు

అనంతపురం జిల్లాలో తీవ్ర విషాదకరమైన ఘటన ఒకటి జరిగింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి.. కాలేజీలోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. అప్పటివరకు అందరు విద్యార్థులతోనే క్లాస్‌రూంలోనే ఉన్న ఆ స్టూడెంట్.. ఒక్కసారిగా లేచి బయటికి వెళ్లి కాలేజీ మూడో అంతస్తు నుంచి దూకేశాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అయితే అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాని.. మిగితా స్టూడెంట్స్ అయోమయంగా చూశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఇప్పుడు ఆ వీడియో బయటికి రావడంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు.

చరణ్ అనే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి గురువారం ఉదయం 10.15 గంటలకు క్లాస్‌రూంలో నుంచి లేచి.. అందరూ చూస్తుండగానే బయటకు వచ్చిన చరణ్.. మూడవ అంతస్తు రేలింగ్ నుంచి కిందికి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. అయితే అతడ్ని ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో చనిపోయినట్లు కాలేజీ వర్గాలు వెల్లడించాయి. అయితే చరణ్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఏంటి అనేది ఇంకా తెలియరాలేదు.

అయితే కాలేజీలోనే చరణ్ ప్రాణాలు తీసుకున్నాడనే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు.. వెంటనే అక్కడికి చేరుకుని.. కళాశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కళాశాల ముందు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ హృదయ విదారక ఘటన కాలేజీ సెక్యూరిటీ కెమెరాలో రికార్డ్ కావడంతో ఇప్పుడు అది వైరల్ అవుతోంది.

ఇక ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు అనే విషయంపై ఆరా తీస్తున్నారు. చరణ్ మానసిక పరిస్థితి గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులను అడిగి పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. కాలేజీలో చదువు ఒత్తిడి వల్ల ప్రాణాలు తీసుకున్నాడా.. లేక ఇంట్లో పరిస్థితులా.. మరేదైనా ఇతర కారణాల వల్ల చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడా అని పోలీసులు ఆరా తీస్తున్నారు.



## రేపు వివి ఫుడ్ కోర్ట్ వారి సత్తిబాబు కోడి పలావ్ నూతన రెస్టారెంట్ ప్రారంభం

నెల్లూరు:నగరంలోని స్థానిక రామలింగాపురం నందు వివి ఫుడ్ కోర్ట్ వారి సత్తిబాబు కోడి పలావ్, నెల్లై తాటి బెల్లం కాఫీ షాపు, టి వనం వారి టి స్నాక్స్ జ్యూస్ పాయింట్ రేపు ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు విలేకరుల సమావేశంలో 25 కళా సంఘాల అధ్యక్షులు, రాష్ట్ర హోటల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరం అంటేనే ఫుడ్కి ఎంతో పెట్టిన పేరని ఆ సందర్భంగా నెల్లూరు ప్రజలకు అందిస్తున్న ఈ హోటల్ ను ఆదరించాలని, నెల్లూరులో మొట్టమొదటిసారి సత్తిబాబు కోడి పలావ్ రెస్టారెంట్లు ప్రారంభిస్తున్నారని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధినేతలు వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, హరి, నాగార్జున, వెంకటేశ్వర్లు, 25 కళా సంఘాల కన్వీనర్ అమీర్జాన్ తదితరులు పాల్గొన్నారు....



# కలిసిపోయిన బీఆర్ఎస్, బీజేపీ

బద్ధ శత్రువులైన ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ కలిసిపోయాయి. రాజకీయంగా శత్రువులుగా ఉండే ఈ రెండు పార్టీలు ప్రజా అభివృద్ధి కార్యక్రమంలో హుందాగా వ్యవహరించాయి. అభివృద్ధి విషయంలో రాజకీయాలు పక్కనపెట్టాయి.

ఉత్తర తెలంగాణలో కీలకమైన కరీంనగర్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బద్ధ శత్రువులుగా ఉండే బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలు కలిసిపోయాయి. ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు కలిసి ఒక్క చోట కనిపించారు. ప్రజా అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ పరిణామం కరీంనగర్ జిల్లాతోపాటు తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది.

కరీంనగర్‌లోని పద్మానగర్‌లో నూతనంగా నిర్మించిన 'ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్'ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావుతో కలిసి పాల్గొన్నారు. పరస్పరం విమర్శలు.. ఆరోపణలు చేసుకోకుండా హుందాగా వ్యవహరించారు. రాజకీయాలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉండొద్దని ఈ కార్యక్రమంతో బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలు చాటిచెప్పాయి.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లో రాజకీయ విమర్శలు చేయనని సంచలన ప్రకటన చేశారు. అందరితో కలిసి పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. పదవులొస్తాయి.. పోతాయి.. అభివృద్ధే శాశ్వతమని పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇకపై తాను రాజకీయ విమర్శలు చేయనని తేల్చిచెప్పారు. జెండా, ఎజెండాలను పక్కనపెట్టి అభివృద్ధే ధ్యేయంగా అన్ని పార్టీల నాయకులతో కలిసి పనిచేస్తానని తెలిపారు.

స్మార్ట్ సిటీ నిధులు అనేక కారణాలతో పూర్తిగా వినియోగంలోకి రాలేదు బండి సంజయ్ చెప్పారు. 'వరంగల్‌కు ధీటుగా కరీంనగర్‌ను అభివృద్ధి చేసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం నుంచి తప్పకుండా నిధులు తీసుకొస్తా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం కొట్లాడి సాధించుకుంటాం' అని బండి సంజయ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావుకు విశేష ప్రాధాన్యం ఇచ్చారు. రెండు ప్రధాన పార్టీలు.. బద్ధ శత్రువులు ఎలాంటి వివాదం లేకుండా సాఫీగా కార్యక్రమాన్ని ముగించడంతో కరీంనగర్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.




## వేతన సవరణ సంఘం, డీఏల కోసం ప్రభుత్వ ఉద్యోగుల పోరాటం



వేతన సవరణ సంఘం కమిటీ నివేదిక త్వరగా ప్రభుత్వానికి సమర్పించి మేలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. వాటితోపాటు పెండింగ్ డీఏలు, పాతన పింఛన్ విధానం అమలు వంటి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఆరోగ్య పథకాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై కూడా లచ్చిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేశారు.

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సమావేశం బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం భార్యభర్తల, వితంతువుల, దివ్యాంగుల, మెడికల్ కేటగిరి కింద ఉద్యోగులను జోన్స్ ట్రాన్స్‌ఫర్స్, పరస్పర, ఎన్నికల బదిలీలను చేసినందుకు జేఏసీ ప్రభుత్వానికి కృతజతలు తెలిపింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం బదిలీ చేసిన తహసీల్దార్లను వెంటనే సొంత శాఖకు పంపించాలని కోరారు.

ఉద్యోగుల పెండింగ్ జీపీఎఫ్, సెలవు జీతం, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. బకాయి పడిన వాహన రవాణా భత్యాలను తక్షణమే విడుదల చేయాలని కోరింది. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి దశల వారీగా కృషి చేస్తామని జేఏసీ తెలిపింది. ఈ సమావేశంలో చేసిన పలు తీర్మానాలను జేఏసీ వెల్లడించింది.

### జేఏసీ తీర్మానాల్లో కొన్ని..

హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్, ఇతర లోన్స్ అడ్వాన్స్‌ను పెంచాలి.

ఈ-కుబీర్‌లో రూ.10 లక్షల లోపు పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి.

ప్రభుత్వ కార్యాలయాలలో మౌళిక సదుపాయాలను కల్పించాలి. ఇందుకు కావాల్సిన బడ్జెట్‌ను పెంచాలి.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అదే రోజునే వారి పెన్షన్ బినిఫిట్స్‌ను అందించాలి.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి.

ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ సీలింగ్‌ను 300 రోజుల నుంచి 360 రోజులకు పెంచాలి.

ఉద్యోగులకు డ్యూటీ నైపుణ్యాలను పెంపొందించుటకు ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో శిక్షణ ఏర్పాటు చేయాలి.

వివిధ కేడర్‌లోని రెవెన్యూ ఉద్యోగులకు ట్రైనింగ్ కొరకు రెవెన్యూ అకాడమీని ఏర్పాటు చేయాలి.

సెక్షన్ 197 ఆఫ్ సీఆర్‌పీసీ ప్రకారం హెచ్ఓడీల ముందస్తు అనుమతి లేకుండా ఉద్యోగులపై క్రిమినల్ చర్యలు చేపట్టరాదు.

ఉద్యోగులు మృతి చెందిన వారి కుటుంబభ్యులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలి.

ఉద్యోగుల మెడిల్ రీయంబర్స్‌మెంట్ సీలింగ్ పరిమితిని పెంచాలి.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలి.

ఉద్యోగుల రిటైర్‌మెంట్ గ్రాట్యుటీని రూ.20 లక్షలకు తక్కువ కాకుండా పెంచాలి.

# చిట్టిరామవరం రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి

**వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న వారిని ప్రభుత్వం**

**ఏడాదికి రూ. 12,000 ఇచ్చి ఆదుకోవాలి**

**11వ వార్డు సభను అడ్డుకుంటాం: గిరిజన జేఏసీ**




భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ 11వ వార్డు చిట్టిరామవరం తండాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని గిరిజన జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం చిట్టిరామవరం తండా కేంద్రంలో జరిగిన జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారిక లెక్కల ప్రకారం తమ గ్రామంలో 330 పైబడి కుటుంబాల వారు నివసిస్తున్నారని చెప్పారు. అందులో దాదాపు 200 కుటుంబాలు రైతు కూలీలుగా జీవిస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలో తమ ఏజెన్సీ ప్రాంతాన్ని కలపడంతో వందరోజుల పని పుస్తకం లేక తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వచ్చే ఏడాదికి 12 వేల రూపాయల పథకాన్ని కోల్పోతున్నామని అన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఏజెన్సీ ప్రాంతమైన చిట్టిరామవరం తండాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేసి వందలాది రైతు కూలీ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. శుక్రవారం చిట్టిరామవరం కేంద్రంగా జరిగే ప్రజా పాలన వార్డు సభను అడ్డుకుంటామని, ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అధికారులు పాలకులు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, జేఏసీ నాయకులు రాజ్ కుమార్, పూర్ణచందర్, భాస్కర్ నాయక్, సీతయ్య, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు ఇంటి పన్ను కట్టలేదని.. తల్లికి వృద్ధాప్య పెన్షన్ కట్



కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు.

కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్దాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.



అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు లబ్ధిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు సీసీ కెమెరాలు వితరణ

- అవాంఛనీయ సంఘటనల నివారణే ధ్యేయం
- రాజ్ మహమ్మద్ జాన్ బి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

భద్రాద్రి కొత్తగూడెం: రాజ్ మహమ్మద్ జాన్ బి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రజాక్ బ్రదర్స్, సంస్థ అధ్యక్షులు పాషా జునైద్ లు జెడ్పీఎస్ఎస్ స్కూల్ రుద్రంపూర్ నందు ఏ విధమైన అవాంఛనీయ సంఘటన లు జరగకుండా సిసి కెమెరాలను వితరణగా అందించారు.జడ్పీ స్కూల్ హెడ్మాస్టర్ బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిఎం శాలెం రాజు, టూ టౌన్ సిఐ రమేష్ కుమార్ పాల్గొని గత కొన్ని సంవత్సరాలు గా ఈ యొక్క సంస్థ హెల్త్ , స్పోర్ట్స్, సామాజిక కార్యక్రమాలకు సంబంధించి ముందు వరుసలో ఉంటూ తమ కుటుంబ సభ్యుల ఆర్థిక వనరుల నుండి కొంత భాగాన్ని మంచి కార్యక్రమాలకు వెచ్చించడం శుభపరిణంగా భావిస్తూ , రాజ్ మహమ్మద్ జాన్ బి స్వచ్ఛంద సేవా సంస్థ గ్రామాలలో ఎటువంటి కార్యక్రమాలు అయినా ముందు వరుసలో ఉంటూనే, చాలా కార్యక్రమాలు నిర్వహించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించడంలో పెద్దన్న పాత్ర పోషిస్తుందని, ఈ యొక్క సంస్థ ఆర్గనైజర్స్ ని వక్తలు అభినందించారు . ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎస్ఓ టు జీ ఎం కోటిరెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్, రాజయ్య, గౌస్, బీముడు, చిలక రాజయ్య ,గోపి కుమార్, సకినాల సమ్మయ్య, గోల్కొండ నవీన్ ,దుర్గా సింగ్, జక్కుల సత్యనారాయణ, కృష్ణ యాకయ్య, సంజీవ్, బోలె, హరీష్, రమాకాంత్, గుండా శ్రీనివాస్, కవి రాజు, అంతడుపుల శివ, నర్సింహారావు, సాగర్, మహేష్, రైమా, స్కూల్ సిబ్బంది లక్ష్మి , రజియా సుల్తానా, కృష్ణవేణి, ఇందిరా, కవిత, వెంకటేశ్వర్లు, చారి, ధీరజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



## అర్హుల జాబితాను తుది సవరణ చేసి తప్పకుండా అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం- అంతర్గాం తాసిల్దార్, తూము రవీందర్ పటేల్



రామగుండం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మెరుమూరు గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు దరఖాస్తు చేసుకున్న ప్రజల కోసం గ్రామసభ నిర్వహించారు . ఈ సందర్భంగా అంతర్గాం తహసిల్దార్ , తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారి జాబితాను ఈ గ్రామసభలో ప్రజల మధ్యల చదివి వినిపించారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలో కొంతమంది వ్యక్తుల పేర్లు రావడం, కొంతమందివి రాకపోవడం వలన ప్రజలు బాధాకరంగా ఉందని, కొంతమంది వ్యక్తులు అనర్హులైనటువంటి వారి పేర్లు జాబితాలో వచ్చాయని, అర్హులైన వారి పేర్లు జాబితాలో రాలేదని తెలిపారు. కావున ప్రజలు ఎవరు కూడా అర్హులైనటువంటి వారు అధైర్య పడవద్దని మళ్లీ మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శుల చేత సర్వే చేపట్టి నాలుగు పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేసి తుది జాబితాను మండల ప్రజా పరిషత్ అధికారి, మండల ప్రజా పాలన అధికారి ద్వారా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానాని, అలాగే మురుమూరు గ్రామపంచాయతీలోఊరిలో ఉన్నటువంటి సమస్యలను గతంలో మండల రెవెన్యూ అధికారికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదని, కావున ఇప్పుడు ఉన్నటువంటి మండల రెవెన్యూ అధికారి తప్పకుండా ఊరికి న్యాయం చేయాలని సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు తక్షణమే ఊరిలోని సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అంతర్గాం తాసిల్దార్ తూము రవీందర్ దరఖాస్తులను స్వీకరించారు. అంతర్గాం తాసిల్దార్, , గ్రామ స్పెషల్ ఆఫీసర్ తూము రవీందర్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం తాసిల్దార్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ తూము రవీందర్ పటేల్, జిల్లా అటవీ శాఖ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ శివయ్య,మండల వ్యవసాయాధికారి సతీష్ కుమార్, గ్రామ కార్యదర్శి కమల, ఏపీవో రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్య క్రాంతి

## ఉల్లిపాయల్లా మేలు చేసే షాలోట్స్

హెల్త్ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ): ఉల్లిపాయల్లో చాలా రకాలు ఉంటాయి. అందులో షాలోట్స్ కూడా ఒకటి. ఇవి చూడ్డానికి ఉల్లిపాయల్లానే ఉంటాయి. కానీ, పొడుగ్గా ఉంటాయి. వీటిని చాలా మంది ఉల్లిపాయల బదులు కూడా వాడుతుంటారు. అయితే, ఈ రెండింటిలో ఉండే తేడాలు, వీటిని తినడం వల్ల కలిగే లాభాల గురించి తెలుసుకోండి.



మార్కెట్లో అప్పుడప్పుడు షాలోట్స్ కనిపిస్తే వాటిని ఉల్లిపాయల్ని చాలా మంది తెచ్చుకుని వాడతారు. నిజానికీ ఈ రెండింటికి కొన్ని తేడాలున్నాయి. ఉల్లిపాయల్ని మనం రెగ్యులర్‌గా అన్నీ కూరల్లో వేస్తాం. ఇవి ఘాటుగా ఉంటాయి. అయితే, షాలోట్స్ మాత్రం కాస్తా మైల్డ్‌గా తియ్యని రుచితే ఉంటాయి. కొద్దిగా వెల్లుల్లి ఫ్లేవర్ ఉంటుంది. వీటిని సలాడ్స్, డ్రెస్సింగ్ వంటి వాటికి వాడొచ్చు. మీకు ఘాటు ఎక్కువగా ఉండాలనుకుంటే ఉల్లిపాయల్ని తీసుకోవచ్చు. అదే కాస్తా ఘాటు తక్కువగా ఉండేవాటిని తినాలకుంటే షాలోట్స్ బెస్ట్. వీటి గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం.

షాలోట్స్‌జి

ఈ షాలోట్స్ ఉల్లి కుటుంబానికి చెందినదే అయినా చూడ్డానికి గోళాకారంగా ఉల్లిపాయల కంటే చిన్నవిగా ఉంటాయి. వీటిని భూమిలో గుంపులుగా పండిస్తారు. షాలోట్స్‌ని ఫ్రెంచ్ వంటల్లో ఎక్కువగా వాడతారు. ఇక ఉల్లిపాయల్ని మనం అన్నీ కూరల్లోనూ వాడతాం. వీటిని సలాడ్‌లా కూడా తింటాం. పచ్చి ఉల్లిపాయల్ని పెరుగులో నంచుకుని తినేవారు బోలెడు మంది ఉంటారు.

పోషకాల విషయానికొస్తే

కేలరీల విషయానికొస్తే షాలోట్స్‌తో పోలిస్తే ఉల్లిపాయల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. 100 గ్రాముల ఉల్లిపాయల్లో 40 కేలరీలు ఉంటాయి. షాలోట్స్‌లో 72 కేలరీలు ఉంటాయి. మీరు కేలరీలను తగ్గించుకోవాలనుకుంటే చక్కగా ఉల్లిపాయలు తినొచ్చు. అయితే, ఉల్లిపాయలతో పోలిస్తే షాలోట్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. 100 గ్రాముల ఉల్లిపాయల్లో 1.7 గ్రాముల ఫైబర్ ఉంటే, షాలోట్స్‌లో 2. 6 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఫైబర్ మనకి డైజెషన్‌ని ఇంప్రూవ్ చేసి కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది. దీంతో ఎక్కువగా తినరు.

విటమిన్స్‌జి

రెండింటిలోనూ ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది. అయితే, రెండింటిలో షాలోట్స్‌లో విటమిన్ సి కంటెంట్ కాస్తా ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇమ్యూనిటీ పెరగడం, స్కిన్ మెరుస్తుంటుంది. కాబట్టి, మీరు వీటిని డైట్‌లో యాడ్ చేసుకోవచ్చు.

యాంటీ ఆక్సిడెంట్స్

ఉల్లిపాయలు, షాలోట్స్ రెండు కూడా ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్‌ని కలిగి ఉంటాయి. ఇవి ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి. ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కాపాడతాయి. షాలోట్స్ ఆంతోసియానిన్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ఎక్కువగా ఎర్రగా కనిపిస్తాయి. ఇవి యాంటీ క్యాన్సర్ గుణాలని కూడా కలిగి ఉంటాయి. ఉల్లిలో ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల బ్లడ్ ప్రెజర్ తగ్గి గుండెకి చాలా మంచిది. ఈ రెండింటిలోనూ యాంటీ ఆక్సిడెంట్స్ మంచి మోతాదులోనే ఉంటాయి. అయితే, షాలోట్స్‌లో క్యాన్సర్‌తో పోరాడే గుణాలు ఎక్కువగా ఉంటాయి.

జీర్ణశక్తికి

కొన్నిఫుడ్స్ తీసుకున్నప్పుడు సరిగా జీర్ణమవ్వవు. అలాంటప్పుడు షాలోట్స్ తీసుకుంటే ఆ జీర్ణ సమస్యలు దూరమవుతాయి. కొన్నిసార్లు రా ఆనియన్స్ తీసుకున్నప్పుడు అందులోని ఫ్రక్టాన్స్ మనకి బ్లోటింగ్, గ్యాస్ వంటి సమస్యలకి కారణమవుతాయి. షాలోట్స్‌లోని ఫ్రక్టాన్స్ కాస్తా తక్కువగా ఉంటాయి. దీని వల్ల కడుపులో గడబిడ తగ్గుతుంది. మీకు జీర్ణ సమస్యలు ఉన్నట్లైతే బ్లోటింగ్ వంటి సమస్యల్ని దూరం చేసుకోవాలనుకుంటే షాలోట్స్‌ని డైట్‌లో యాడ్ చేసుకోండి.

ఏది రుచిగా

రుచి విషయానికొస్తే ఉల్లిపాయలు సూప్స్, స్టిర్ ఫ్రైస్ వంటి వాటికి వాటి ఘాటైన రుచితే పెర్ఫెక్ట్ జత అవుతాయి. ఇక షాలోట్స్ కాస్తా స్వీట్‌నెస్‌తో డ్రెస్సింగ్స్, సలాడ్స్‌కి బాగుంటాయి. ఉల్లి ఘాటుని తగ్గించుకోవాలనుకునేవారు షాలోట్స్‌ని ట్రై చేయొచ్చు. ఘాటైన కూరలు, మసాలా వాటికి ఉల్లిపాయల్ని వాడొచ్చు.

రెండింటిలో ఏది బెటర్

రెండు కూరగాయలు కూడా వేటికవే ప్రత్యేకం. అయితే, కొన్ని పోషకాల్లో షాలోట్స్ ముందంజలో ఉంటుంది. అయితే, మీ అవసరాన్ని బట్టి, టేస్ట్‌ని బట్టి దేనిని ఎంచుకున్నా పర్లేదు.

## అరటిపండు తొక్కతో బ్లడ్ ప్రెజర్ కంట్రోల్ అవుతుందా, నిపుణుల ఏం చెబుతున్నారంటే

హెల్త్ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ):



అరటిపండు అందరికీ ఈజీగా లభించే పండు. ఈ పండు తింటే ఎన్నో లాభాలు. ఇందులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. అయితే, పండులో మాత్రమే కాదు. తొక్కలోనూ ఆరోగ్యానికి సంబంధించి ఎన్నో లాభాలున్నాయి. దీనికి సంబంధించి చాలా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకటే. అరటిపండు తొక్క తింటే బీపి కంట్రోల్‌లో ఉంటుందని.

అరటిపండ్లలో ఎన్నో రకాల బెనిఫిట్స్ ఉన్నాయని అందరికీ తెలిసిందే. అయితే, ఈ పండు తొక్క కూడా అంతే ఆరోగ్య ప్రయోజనాలనిస్తుందని చెబుతున్నారు కొంతమంది. మనం సాధారణంగా అరటిపండు తిని తొక్కని పారేస్తాం. కానీ, తొక్కలో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, తొక్క తింటే బాగా నిద్రపడుతుందని, రక్తపోటు కూడా కంట్రోల్ అవుతుందని ఓ వీడియోలో చెబుతున్నారు. ఇందులో నిజమెంతో డాక్టర్‌ని అడిగి తెలుసుకునే ప్రయత్నం చేసింది ఫ్యాక్ట్ చెక్ టీమ్.

అరటిపండు జీర్ణక్రియకి ఎంతగానో హెల్ప్ చేస్తుంది. అయితే, ఓ యూట్యూబ్ ఛానెల్‌లో, దీని పై తొక్క మంచినిద్రని ప్రేరేపిస్తుందని, మానసిక స్థితిని మెరుగు పరుస్తుందని చెబుతోంది. దీంతో పాటు, బరువుతగ్గించడంలో, ఎముకల్ని బలంగా చేయడంలో సాయపడుతుంది. అదే విధంగా, రక్తపోటుని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఇందులో నిజమెంతో తెలుసుకోండి.

అరటిపండు తొక్కలో

అరటిపండు తొక్కలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. బరువుని తగ్గిస్తుంది. ట్రిప్టోఫాన్ మానసిక స్థితిని మెరుగ్గా చేస్తుంది. నిద్రని ప్రేరేపిస్తుంది. కాల్షియం, పొటాషియం కంటెంట్ బలంగా చేస్తుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. రక్తపోటుని కంట్రోల్ చేస్తుంది. దీనిని మనం స్మూతీస్‌లో వాడడం, టీలా చేసుకుని తాగడం చేయొచ్చు.

డాక్టర్ ఏమంటున్నారంటే

ఇదే విషయంపై నవీ ముంబైలోని కోకిలా ధీరూభాయ్ అంబానీ హాస్పిటల్‌లోని డైటీషియన్ ప్రతీక్షా కదమ్ ప్రకారం, అరటిపండ్లు తింటే ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఇది ప్రేగులని ఆరోగ్యంగా ఉంచుతుంది. మరియు జీర్ణక్రియకి హెల్ప్ అవుతుంది. ప్రేగు కదలికల్ని సులభతరం చేస్తుంది. ఇందులోని అధిక ఫైబర్, లో కేలరీ కంటెంట్ కడుపు నిండుగా ఉంచడంలో హెల్ప్ చేస్తుంది. బరువు తగ్గడానికి సాయపడుతుంది.

పైతొక్క గురించి

అరటిపండు పై తొక్కలోని పోషకాల గురించి చూస్తే మనకి అవసరమైన ఫైబర్, అమైనో యాసిడ్స్‌ని అందిస్తుంది. ఇది అధిక రక్తపోటుని కంట్రోల్ చేస్తుంది. మన గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. అంతేకాదు, మనిషి ఎముకలని బలంగా చేయడంతో పాటు మానవ శరీరంలోని యూరినరీ ఆర్గాన్‌లో రాళ్లు ఏర్పడకుండా నిరోధిస్తుంది.

మెంటల్ హెల్త్ కోసం

అరటిపండులో ట్రిప్టోఫాన్ ఉంటుంది. ఇది మానసిక స్థితి, నిద్ర నాణ్యతని మెరుగ్గా చేస్తుంది. ఇందులోని పొటాషియం గుండెకి మేలు చేస్తుంది. రక్తపోటుని కంట్రోల్ చేస్తుంది. మెగ్నీషియం, కాల్షియం కంటెంట్ ఎముకల్ని బలంగా చేస్తుంది.

అరటిపండు తొక్కని ఎలా తినాలి

ఈ తొక్క చాలా మందంగా, చేదుగా ఉంటుంది. కాబట్టి, శుభ్రంగా కడిని స్మూతీస్‌లో కలపొచ్చు. జాగ్రత్త అవసరంఅయితే, మనం ఈ తొక్కల్ని తీసుకునేటప్పుడు ఆర్గానిక్ తొక్కల్ని మాత్రమే వాడాలి. వీటిని వాడే ముందు బాగా క్లీన్ చేయాలని. అరటిపండు తొక్కలో ఆరోగ్య ప్రయోజనాలు ఉండడం నిజమేనని సజాగ్ ఫ్యాక్ట్ చెక్‌లో తేలింది.

# అండర్-19 ప్రపంచకప్.. సూపర్ సిక్స్‌లోకి యువ భారత్..!



స్పోర్ట్స్ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ): మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా సూపర్ సిక్స్‌లోకి ప్రవేశించింది. శ్రీలంకపై 60 పరుగులతో విజయం సాధించింది. మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ గొంగాడి త్రిష బ్యాటింగ్‌తో పాటు బౌలర్లు సైతం రాణించడంతో బౌలర్లు రాణించడంతో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. క్లిష్ట పరిస్థితుల్లో త్రిష 44 బంతుల్లో ఐదు ఫోర్లు, ఇక సిక్సర్ సహాయంతో 49 పరుగులు చేసింది. మొదట టాస్ గెలిచిన శ్రీలంక జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియాకు మొదట్లోనే షాక్ తగిలింది. ఓపెనర్ జీ కమలిని 5 పరుగులకే అవుట్ అయ్యింది. ఆ తర్వాత సానికా చల్కే డకౌట్‌గా వెనుదిరిగింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. మరో వైపు మరో ఓపెనర్ త్రిష లంక బౌలర్లను ఎదుర్కొంటూ బ్యాటింగ్ చేసింది. భారత్ ఇన్నింగ్స్‌లో మిథిలా వినోద్ (10 బంతుల్లో 16), వీజే జోషిత (తొమ్మిది బంతుల్లో 14) చివరి ఓవర్లలో వేగంగా పరుగులు చేశారు.

దాంతో నిర్ణీత 20 ఓవర్లలో యువ భారత్ తొమ్మిది వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. లంక బౌలర్లలో ప్రముది మేథ్సార, లిమాన్స తిలకరత్న, అసేని తలగునేకు తలో రెండు వికెట్లు తీయగా.. చమోది ప్రబోధ, నాయక్కర, రష్మికకు తలో వికెట్ దక్కింది. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన లంక జట్టు పెవిలియన్‌కు క్యూ కట్టింది. టీమిండియా బౌలింగ్ ధాటికి శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 58 పరుగులు మాత్రమే చేసింది. శ్రీలంక బ్యాట్‌వుమెన్స్‌కు బౌలర్లు ఏ దశలోనూ పరుగులు చేసేందుకు అవకాశం ఇవ్వలేదు. వీజే జోషిత, షబ్నమ్, పారుణిక సిసోడియాకు తలో రెండు వికెట్లు దక్కగా.. ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మకు తలో వికెట్ పడగొట్టారు. శ్రీలంక బ్యాటర్స్‌లో రష్మిక 15 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. టీమిండియా ఈ నెల 26న సూపర్ సిక్స్ మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనున్నది. రెండో మ్యాచ్‌ను 28న నెదర్లాండ్‌తో ఆడనున్నది.

# సెమీస్‌కు సిన్నర్



స్పోర్ట్స్ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ): ఆస్ట్రేలియా ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ సెమీఫైనల్స్ చేరాడు. రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఈ ఇటలీ కుర్రాడు.. 6-3, 6-2, 6-1తో ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినార్‌పై అలవోకగా గెలిచాడు. మరో మ్యాచ్‌లో అమెరికా యువ సంచలనం బెన్ షెల్టన్.. 6-4, 7-5, 4-6, 7-6 (7/4)తో లొరెంజజో(ఇటలీ)ని ఓడిం చి ఈ టోర్నీలో తొలిసారి సెమీస్‌కు అర్హత సాధించాడు. సెమీస్ పోరులో షెల్టన్.. సిన్నర్‌తో తలపడనున్నాడు.

**స్వియాటెక్.. తగ్గేదేలే!**

మహిళల సింగిల్స్‌లో పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్.. ఈ టోర్నీలో తన ఆధిపత్యాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. క్వార్టర్స్ పోరులో స్వియాటెక్ 6-1, 6-2తో ఎమ్మా నవర్రొ (యూఎస్ఏ)ను చిత్తుచేసింది.మరో మ్యాచ్‌లో 19వ సీడ్ మాడిసన్ కీస్ 3-6, 6-3, 6-4తో ఎలీనా స్వితోలినా(ఉక్రెయిన్)ను ఓడించి సెమీస్ చేరింది. సెమీస్‌లో స్వియాటెక్, కీస్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

# 14,505 క్రికెట్ బంతులతో.. వాంఖడే స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు




స్పోర్ట్స్ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ):ముంబై క్రికెట్ అసోసియేషన్.. గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. వాంఖడే స్టేడియంలో క్రికెట్ బంతులతో .. 50 ఏళ్ల వార్సికోత్సవాన్ని జరుపుకున్నది. స్టేడియంలో 14,505 బంతులతో.. ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖడే స్టేడియం అని రాసింది. దీని కోసం ఎరుపు, తెలుపు బంతుల్ని వాడింది. 1975లో వెస్టిండీస్‌తో వాంఖడే స్టేడియంలో తొలి అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ జరిగింది.14 వేల క్రికెట్ బంతులతో 50 ఏళ్ల వార్షికం సందర్భంగా ప్రదర్శన ఇచ్చారు. ఎంసీఏ ప్రెసిడెండ్ అజింక్య నాయక్ దీనిపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. మాజీ ప్లేయర్ ఏకనాథ్ సోల్కర్‌తో పాటు మాజీ ముంబై ఆటగాళ్ల స్మారకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. 1975లో జరిగిన మ్యాచ్‌లో సోల్కర్ సెంచరీ నమోదు చేశాడు. ఆ ఏడాది జనవరి 23 నుంచి 29 వరకు ఆ మ్యాచ్ జరిగింది. స్కూళ్లు, క్లబ్‌లు, ఎన్జీవోలకు చెందిన యువ క్రికెటర్లకు ఆ బంతుల్ని కానుకగా ఇవ్వనున్నట్లు ఎంసీఏ ప్రెసిడెంట్ తెలిపారు.


# రంజీ మ్యాచ్‌లో విఫలమైన రోహిత్ శర్మ.. యువ ఆటగాడి ప్లేస్ ఆక్రమించడంటూ ఆగ్రహం..!

స్పోర్ట్స్ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ): రంజీ ట్రోఫీలో భాగంగా ముంబయి-జమ్మూ కశ్మీర్ మధ్య గురువారం మ్యాచ్ మొదలైంది. దాదాపు పదేళ్ల తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ దేశవాళీ క్రికెట్ ఆడుతుండడంతో మ్యాచ్‌ను చూసేందుకు చాలామంది అభిమానులు స్టేడియానికి చేరుకున్నారు. క్రీజులో ఎక్కువగా సేపు చూడాలన్న అభిమానుల ఆశ తీరలేదు. రోహిత్ కేవలం మూడు పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. గత కొంతకాలంగా పేలవమైన ఫామ్‌తో ఇబ్బందులుపడుతున్న హిట్‌మ్యాన్ రంజీల్లోనూ విఫలం కావడంతో అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ మ్యాచుల్లో, దేశవాళీ మ్యాచుల్లో ప్రదర్శన ఏమాత్రం బాగా లేదని మండిపడుతున్నారు. రోహిత్ ప్లేస్‌లో తుది జట్టుకు దూరమైన ఆయుష్ మాత్రేకు అభిమానులు మద్దతు ప్రకటించారు. యువ ఆటగాడి స్థానాన్ని రోహిత్ ఆక్రమించుకున్నాడని అభిమానులు విమర్శించారు.



వాస్తవానికి జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో రోహిత్‌పై చాలా అంచనాలున్నాయి. దేశవాళీ టోర్నీలో భారీగా పరుగులు చేసి తిరిగి ఫామ్‌లోకి వస్తాడని అభిమానులు భావించారు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం రోహిత్ మూడు పరుగులకే అవుట్ అయ్యాడు. ఆయుష్ మాత్రే ప్లేస్‌లో రోహిత్ శర్మ తుదిజట్టులోకి వచ్చాడు. ముంబయి తరఫున ఆడిన చివరి రంజీ మ్యాచ్‌లో ఆయుష్ సెంచరీ సాధించాడు. సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఆయుష్ ఈ సీజన్‌లో రంజీలో తొమ్మిది ఇన్నింగ్స్‌లలో 45.33 సగటుతో 408 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నది. విజయ్ హజారే ట్రోఫీలో ముంబయి తరఫున తన చివరి మ్యాచ్‌లో 148 పరుగులు కూడా చేశాడు. రంజీ డిఫెండింగ్ చాంపియన్ ముంబయి ఫామ్‌లో లేని రోహిత్ కోసం ఆయుష్‌ను పక్కన పెట్టడం ఏమాత్రం అభిమానులకు రుచించలేదు.

మ్యాచ్‌లో ఆయుష్‌ను తుదిజట్టు నుంచి తప్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి నుంచి దేశవాళీ క్రికెట్ వరకు రోహిత్ శర్మ ఓ యువ క్రికెటర్ స్థానాన్ని తినేశాడని ఓ యూజర్ ఆరోపించాడు. ఎలాంటి తప్పు చేయకుండానే ఆయుష్‌ను తప్పించారని విమర్శించాడు. గత రంజీ మ్యాచ్, విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో సెంచరీ చేసిన యువ ఆటగాడు ఆయుష్ మాత్రే అని.. నిస్వార్థంగా రంజీలు ఆడాలనుకుంటున్న యువ ఆటగాడిని తొలగించారని.. రోహిత్‌ను అత్యంత స్వార్థపూరిత క్రికెటర్ అంటూ లీసా అనే యూజర్ ఆరోపించారు. మరో నెటిజన్ ఇంటర్నేషనల్ మ్యాచ్ అయినా.. డొమెస్టిక్ క్రికెట్ అయినా సేమ్ టూ సేమ్ అంటూ రోహిత్‌పై సెటైర్లు వేశారు.




# భర్త, ముగ్గురు పిల్లలతో తిరుమలలో గడపాలని ఉంది..!



మూవీ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ):అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీదేవి వారసురాలిగా సినీరంగ ప్రవేశం చేసిన జాన్వీ.. తనదైన నటనతో కొద్ది సమయంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం బాలీవుడ్, టాలీవుడ్ అనే తేడా లేకుండా వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నది. తెలుగులో దేవర మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. రామ్ చరణ్ సరసన నటిస్తున్నది. తాజా కరణ్ జోహార్ షోలో జాన్వీ కపూర్ పాల్గొన్నది. ఈ సందర్భంగా పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనకు తిరుపతిలో పెళ్లి చేసుకోవాలని ఉందని తన కోరికను బయటపెట్టింది.
ముగ్గురు పిల్లలను కనాలని ఉందని.. పిల్లలు, భర్తతో కలిసి తిరుమలలోనే హాయిగా గడపాలని ఉందని చెప్పింది. నిత్యం అరటి ఆకులో భోజనం చేస్తూ.. గోవిందా గోవిందా అని సర్మించుకోవాలని ఉందని తెలిపింది. మణిరత్నం సినిమాల్లోని పాటలు వింటూ కూర్చోవాలని ఉందని చెప్పుకొచ్చింది. తన భర్తను లుంగీలోనే చూడాలని ఉందని.. చూసేందుకు చాలా రొమాంటిక్‌గా ఉంటుందని జాన్వీ చెప్పుకొచ్చింది. ఇదిలా ఉండగా.. జాన్వీ కపూర్‌కు తిరుమల వేంకటేశ్వరస్వామి అంటే ఎనలేని భక్తి. సమయం దొరికినప్పుడల్లా తిరుమలను సందర్శిస్తుంటారు. జాన్వీ కపూర్ తెలుగులో 'దేవర-1'లో నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రామ్ చరణ్ 16 మూవీలో నటిస్తున్నది. బాలీవుడ్‌లో సన్నీ సంస్కారీ కి తులసీ కుమారి మూవీలో నటిస్తున్నది. ఈ చిత్రం ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల కానున్నది.

# బ్యాక్ టు వర్క్..
# వెబ్ సిరీస్ షూట్‌లో సమంత



మూవీ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ):తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో ఒకరు సమంత . సిటాడెల్ వెబ్ ప్రాజెక్ట్‌తో బిజీగా మారిన ఈ బ్యూటీ.. విడుదల తర్వాత రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. సమంత క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం యూఎస్ టూర్‌లో ఉన్న విషయం తెలిసిందే. యూఎస్‌లో తన వర్కవుట్ సెషన్‌తోపాటు ఇతర కార్యకలాపాల గురించి అప్‌డేట్స్‌ను నెట్టింట షేర్ చేసుకుంది. అయితే సామ్ తన లాంగ్ ట్రిప్ వెకేషన్ ముగించుకొని ఇండియాకు తిరిగొచ్చేసింది. బుధవారం చెన్నై, ముంబైలో జరిగిన ఈవెంట్స్‌లో పాల్గొన్నది. చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ కోసం చెన్నై సూపర్ చాంప్స్ జెర్సీని లాంచ్ చేసింది. ఈవెంట్ ముగిసిన తర్వాత ముంబైకి పయనమైంది.
మళ్లీ చాలా కాలం తర్వాత తన కొత్త వెబ్ సిరీస్ రక్త్ బ్రహ్మాన్డ్ వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది. ఇప్పుడీ అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు సామ్ అభిమానులు. విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు.

# మీ కోసం వచ్చేస్తున్నా అంటున్న డార్లింగ్..



మూవీ న్యూస్ , 23 జనవరి (క్రాంతిన్యూస్ ):ఫౌజీ సినిమా షూటింగ్ సెట్‌కి వచ్చే వారం నుంచి ప్రభాస్ హాజరవుతారన్నది లేటెస్ట్ న్యూస్. ఆ మధ్య సర్జరీ కోసం ఫారిన్ వెళ్లిన ప్రభాస్ త్వరలోనే రిటర్న్ ఫ్లైట్ ఎక్కనున్నారు. ఆయనక్కడ స్టార్ట్ అవుతున్నారని తెలియగానే రెడీ అవుతోంది ఫౌజీ సెట్. హైదరాబాద్‌లోనే మేజర్ షెడ్యూల్‌ని ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది ఫౌజీ. ఈ కథలో రాధేశ్యామ్‌లాంటి రొమాంటిక్ యాంగిల్‌ని కూడా ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు ఫ్యాన్స్. ఫౌజీ షెడ్యూల్ పూర్తి కాగానే రాజా సాబ్‌కి సంబంధించిన పనుల మీద కాన్‌సెన్‌ట్రేట్ చేస్తారు డార్లింగ్. ఆయన కాల్షీట్ ఇచ్చేదాన్ని బట్టి రాజాసాబ్ చెప్పిన డేట్‌కే వస్తుందో లేదో తెలిసిపోతుందంటున్నారు నియర్ అండ్ డియర్స్. ఇప్పటికే రాజాసాబ్‌కి సంబంధించి మూడు పాటల రికార్డింగ్ పూర్తయింది. రాజాసాబ్‌లో ఫ్యాన్స్ ఇంకో వరల్డ్ ని విట్‌నెస్ చేస్తారన్నది కంపోజర్ చెబుతున్న మాట. ఈ సినిమా సినిమాలూ ఓ కొలిక్కి రాగానే సలార్ సీక్వెల్ కూడా లైన్లో నిలబడుతుంది. ఆల్రెడీ సలార్2 పనులను ఫుల్ ఫ్లెడ్జ్ డ్‌గా అప్పుడో ఇప్పుడో మొదలు పెట్టేస్తారనే వార్తలు జోరందుకున్నాయి. కాస్త అటూ ఇటూగా ఉన్న ప్రభాస్ కెరీర్‌ని గాడిలో పెట్టిన మూవీగా సలార్ మీద స్పెషల్ రెస్పెక్ట్ ఉంది అభిమానుల్లో. రీసెంట్‌గా కల్కి సీక్వెల్ గురించి మాట్లాడారు నిర్మాత అశ్వనీదత్. కల్కిలో ఉన్న కేరక్టర్లు అన్నీ కంటిన్యూ అవుతాయన్నారు. అవసరమైతే కొత్త కేరక్టర్లు వచ్చే అవకాశం కూడా ఉందన్నారు. సో... ఇన్ని ప్రాజెక్టుల మధ్య కల్కి పనులు పూర్తి చేయాలి ప్రభాస్. మరోవైపు సందీప్ వంగా స్పిరిట్ మీద కూడా హైప్ సూపర్‌డూపర్‌గా క్రియేట్ అవుతోంది.

# రెండోసారి తల్లికాబోతున్న టాలీవుడ్ హీరోయిన్..



మూవీ న్యూస్ , 23 జనవరి( క్రాంతిన్యూస్ ):అమీ జాక్సన్.. బ్రిటన్ కు చెందిన ఈ హీరోయిన్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన ఎవడు చిత్రంలో సెకెండ్ హీరోయిన్ గా నటించింది. అలాగే విక్రమ్ హీరోగా శంకర్ తెరకెక్కించిన ఐ సినిమాలో మెయిన్ హీరోయిన్ గా ఆకట్టుకుంది. వీటితో పాటు పలు తమిళ్, హిందీ సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. అయితే ఇప్పుడు ఈ బ్రిటిష్ నటి విదేశాల్లో స్థిరపడింది. అమీ జాక్సన్ 2015 నుండి 2021 వరకు హొటల్ వ్యాపారి జార్జ్ పనాయోటౌతో రిలేషన్‌షిప్ కొనసాగించింది. 2019లో నిశ్చితార్థం చేసుకున్నారు. అయితే అదే సంవత్సరం అమీ ఒక ఆడబిడ్డను ప్రసవించింది. అప్పటికింకా వారికి పెళ్లి కాలేదు. కానీ 2021లో అమీ, జార్జ్ విడిపోయారు. ఆ తర్వాత ఆమె ఆంగ్ల నటుడు ఎడ్ వెస్ట్‌విక్‌తో డేటింగ్ ప్రారంభించింది. గతేడాది ఆగస్టులో పెళ్లి కూడా చేసుకుంది. ఆ తర్వాత అక్టోబర్‌లో తాను మరోసారి గర్భం ధరించినట్లు ప్రకటించింది అమీ. ఇప్పుడు ఏకంగా బికినీలో తన బేబీ బంప్‌ని చూపిస్తూ కొత్త ఫోటోలను షేర్ చేసిందీ అందాల తార. పూల్ ముందు నగ్నంగా నిలబడిన ఫోటోలు షేర్ చేసిన అమీ జాక్సన్.. 'దీన్నిప్పుడు స్కిన్నీ డిప్పింగ్ అనలేం' అంటూ క్యాప్షన్ ఇచ్చింది.అమీ జాక్సన్ షేర్ చేసిన బేబీ బంప్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. వీటిని చూసిన నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొంత మంది కంగ్రాట్స్ చెబుతుంటే మరికొందరు మాత్రం విమర్శిస్తున్నారు. ఇలా నగ్నంగా కాకుండా మాములుగా కూడా ప్రెగ్నెన్సీ అనుభూతులు పంచుకోవచ్చని హీరోయిన్ కు సూచిస్తున్నారు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com